

ఓ వైపు కృష్ణపట్నం పోర్టు, మరోవైపు రామాయపట్నం పోర్టు... ఇంకోవైపు క్రిస్‌సిటీ... మరో వైపు చెన్నై-విశాఖ కారిడార్... వీటి మధ్యన నెల్లూరు జిల్లా. పారిశ్రామికంగా ఎంతో పురోభివృద్ధి సాధించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఏపీఐఐసీ పనితీరు ఆ అవకాశాలను నాశనం చేస్తోంది. పారిశ్రామికీకరణలో కీలకమైంది ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్(ఏపీఐఐసీ). కొత్తగా ఏ చిన్న పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నా, ఈ సంస్థే భూమిని కేటాయించాల్సి ఉంది. అయితే జిల్లాలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో బంతాట ఆడినట్లు జోనల్ కార్యాలయాన్ని ఓ సారి ఒంగోలుకు, తరువాత నాయుడుపేటకు, చివరకు నెల్లూరుకు మార్చారు. పోనీ ప్రభుత్వం మారిన తరువాత అయినా ఈ వ్యవస్థ గాడిన పడుతుందనుకుంటే మళ్లీ పాతపోకడలే కొనసాగుతున్నాయి.



నెల్లూరు ఏకే నగర్‌లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం

- భర్తీ కాని కీలక పోస్టులు
- నియామకంపై దృష్టి సారించని అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలోనే నాశనం
- పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం
- నెల్లూరంటే ఎందుకంత చిన్నచూపు ?

ఏపీఐఐసీలో కుర్చీల ఖాళీ

నెల్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో కీలక పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులందరినీ బదిలీ చేశారు. అయితే ఆ స్థానంలో కొత్తగా ఏ ఒక్కరిని నియమించలేదు. దీంతో ఇప్పుడు నెల్లూరు జోనల్ కార్యాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తోంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, కనీసం గైడ్ చేసేవారు కరువయ్యారు.

● సీట్లన్నీ ఖాళీనే..

నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో కీలక సీట్లు ఖాళీ అయిపోయాయి. జోనల్ మేనెజర్ (జడ్‌ఎం)సీటు చాలాకాలం నుంచి ఇన్‌చార్జిల పాలనలో సాగుతోంది. ఇటీవల బదిలీల్లో కూడా ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. డీజెడ్‌ఎం(డిప్యూటీ జోనల్ మేనెజర్)ఫైనాన్స్, డీజెడ్‌ఎం అసెట్స్ మేనెజ్‌మెంట్, డీజెడ్‌ఎం ఇంజనీరింగ్(నెల్లూరు, నాయుడుపేట రెండు పోస్టులు), మేనేజర్ అసెట్స్ మేనెజ్‌మెంట్, మేనేజర్ ఇంజనీరింగ్ పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులను ఇటీవల ఒక్కసారిగా బదిలీచేశారు. ఈ స్థానాల్లో ఒక్కరిని కూడా ఇంతవరకు నియమించలేదు. గతంలో కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తుండగా, జీతాలు రాక మానేశారు. ప్రస్తుతం ఒకే ఒక్క డీజెడ్‌ఎం ఉండడం, ఆయనే ఇన్‌చార్జి జెడ్‌ఎం కావడం గమనార్హం. కాగా ఈనెల జీతాలు పెట్టేందుకు కూడా సంబంధిత అధికారులు లేరంటూ ఆ శాఖ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో బంతాట

రాష్ట్రంలో విశాఖపట్నం తరువాత పారిశ్రామికంగా, వేగంగా వృద్ధి చెందుతున్న ప్రాంతం ఉమ్మడి నెల్లూరు జిల్లానే. ఇప్పటికే ఉన్న కృష్ణపట్నం పోర్టుకుతోడు కొత్తగా రామాయపట్నం పోర్టు చేరింది. ఇంతటి కీలకమైన నెల్లూరు జిల్లాలో ఏపీఐఐసీ విభాగంతో వైసీపీ ప్రభుత్వం బంతాట ఆడుకుంది. జిల్లాల పునర్విభజన తరువాత నెల్లూరు జోనల్ కార్యాలయాన్ని రద్దుచేసింది. నెల్లూరును సబ్‌జోన్‌గా మార్చి ఒంగోలు జోనల్ కార్యాలయం కిందకు చేర్చింది. ఈ విషయమై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేఖత రావడంతో ఒంగోలు నుంచి కాస్త నాయుడుపేట స్పెషల్‌జోన్ కిందకు

- మిగతా 6లో..

చుక్కల భూముల
చిక్కులు తొలగేదెప్పుడు !

- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- రెవెన్యూ శాఖలో ప్రక్రియ పూర్తి
- జేసీ లాగిన్లో ఆగి ఉన్న ఫైళ్లు

అల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర దశాబ్ద కాలం నుంచి ఇబ్బంది పెడుతున్న చుక్కల భూముల సమస్య తీరేది ఎప్పుడంటూ అంటూ రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తొలుత ఈ సమస్య తొలుత ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే ప్రారంభమైనా నేటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రారంభమైన ఈ సమస్య ఉమ్మడి రాష్ట్ర మంతటా ఉత్పన్నమైంది. రాష్ట్ర విభజన జరిగినా కూడా చుక్కల భూముల సమస్య తీరలేదు.

● చుక్కల భూములు అంటే...

చుక్కల భూములంటే బ్రిటీష్ హయాంలో తొలిసారిగా చేపట్టిన భూసర్వేలో అనుభవంలో ఉన్న రైతుల పేర్లు నమోదు చేయడం, ప్రభుత్వం ఆధీనంలో ఉండే భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించడం, ఇనాం ఇచ్చిన వారికి ఇనాం గానూ అసలు ఎవరు అనుభవంలో ఉన్న విషయం తెలియక చుక్కలు పెట్టడం చేశారు. దీన్నే ఆర్ఎస్ఆర్ (డైగ్లాట్) అని కూడా అంటారు. ఈ ప్రక్రియలో పెట్టిన చుక్కలే నేడు రైతులకు సమస్యగా మారాయి. అప్పటి నుంచి ఆర్ఎస్ఆర్‌లో చుక్కలు కలిగిన భూములను పట్టా భూములతోపాటు రిజిస్ట్రేషన్లు చేస్తూ వచ్చారు.

● సమస్య ఉత్పన్నమైందిలా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఒకటిన్నర దశాబ్దం క్రితం జేసీగా పనిచేసిన ఓ అధికారి ఈ చుక్కలు ఉండే భూములు ఉండే పట్టికలో రైతుల పేర్లు లేనందున వీటిని ప్రభుత్వ భూములుగా పరిగణించాలంటూ ప్రకటన చేశారు. ఆ ప్రకటన ఆధారంగా చుక్కలు ఉన్న భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ 22-ఏలో నమోదు చేశారు. దీంతో వేలాది ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లను అర్థంతరంగా నిలిపివేశారు. ఈ భూములకు పరిష్కారాన్ని చూపించాలని 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. భూముల రికార్డులను, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను, లింకు డాక్యుమెంట్లను అనుభవకాలం 12 దాటి ఉండడం, తదితర వాటిని పరిశీలించి పూర్తిస్థాయిలో అనుభవంలో ఉన్న వారికి పట్టా భూములుగా మార్పు చేసేలా కార్యాచరణ చేపట్టింది. దీని కోసం సుమారు మూడేళ్ల కాలం పట్టింది. అన్ని చక్కదిద్దే క్రమంలో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. వైసీపీ ప్రభుత్వం నూతన ప్రక్రియగా చుక్కల భూముల సమస్యను తీసుకొచ్చి జేసీ ఆధ్వర్యంలో ప్రక్రియను చేపట్టింది. పట్టాగా మార్పు చేసే క్రమంలో సర్వేనెంబర్లు జేసీ లాగిన్లోకి వెళ్లి అక్కడి నుంచి అనుమతులు పొంది జిల్లా రిజిస్ట్రారు కార్యాలయానికి చేరుకుంటే అక్కడ 22-ఏ (నిషేధిత భూమి జాబితా)లో నుంచి తొలగించేలా కార్యాచరణ రూపొందించింది.

● ఇక్కడే అసలు సమస్య

జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం నుంచి చుక్కల భూములుగా నమోదు చేయబడిన సర్వేనెంబర్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాల్సిన బాధ్యత రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించింది. ఈ శాఖ ద్వారా అన్నీ సర్వేనెంబర్లు పూర్తిస్థాయిలో సదరు జాబితా నుంచి తొలగించి

- మిగతా 6లో..



అట్టముక్కలతో రూపొందించిన జాతీయ చిహ్నం

అద్భుతం... ఆ కళాఖండాలు !

అట్టముక్కలతో అద్భుతాలు సృష్టించడం నెల్లూరు నగరంలోని కిడాంబి నరసింహన్‌కి వెన్నతో పెట్టిన విద్య.ఆయన సృష్టించిన కళాఖండాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. నగరంలో ప్రసిద్ధి చెందిన 'సంతానం బుక్ స్టాల్' అధినేతగా ఆయన పాత పుస్తకాల వ్యాపారం చేస్తున్నా, ప్రవృత్తిగా చిత్రలేఖనంపై దృష్టి సారించి, దేవతామూర్తుల చిత్రాలను అద్భుత కళాఖండాలుగా రూపొందిస్తున్నారు.

- వివరాలు 6లో..

జడ్పీ ఉద్యోగ బదిలీలపై
రివైజ్డ్ అఫిడవిట్

● ప్రస్తుత కేసును ఉపసంహరించుకున్న చైర్‌పర్సన్

నెల్లూరు జడ్పీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జడ్పీలో ఉద్యోగుల బదిలీలపై న్యాయస్థానంలో కేసులు కొనసాగుతున్నాయి. తన అనుమతి లేకుండా జడ్పీలో ఉద్యోగులను అధికారులు ఇష్టానుసారంగా బదిలీ చేశారని హైకోర్టులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయ స్థానం అధికారులను ఆదేశించింది. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ అనుమతితోనే బదిలీలు జరిగాయని, అందుకు సంబంధించిన పత్రాలను అధికారులు కోర్టుకు సమర్పించారు. దీంతో తాము తొలుత ఇచ్చిన రఫ్‌నోట్‌ను అధికారులు న్యాయస్థానానికి అందజేసి తప్పుదోవ పట్టిస్తున్నారని, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొంటూ రివైజ్డ్ అఫిడవిట్‌ను సోమవారం హైకోర్టులో వేయనున్నారు. కాగా ప్రస్తుతం వేసిఉన్న పిటిషన్‌ను ఆమె ఉపసంహరించుకున్నారు. దీంతో బదిలీల కేసు మళ్లీ కొనసాగనుంది.


శివా.. దారిచూపవా ?

సీతారామపురం మండలం దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరానికి వెళ్లేందుకు భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈ క్షేత్రంలో పరమశివుడు, పార్వతీదేవి నక్క వాహనంపై కొలువుతీరి ఉంటారు. కోరిన కోర్కెలు తీరుతాయనే ప్రగాఢ నమ్మకంతో ఏడాది పొడవునా ఇక్కడకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. కార్తీకమాసం, మహాశివరాత్రి సమయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ క్షేతానికి వెళ్లేందుకు ఇదిగో ఇలా ఉంది రహదారి. వర్షాలు పడితే మట్టి రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి బురదమయంగా మారుతుంది. కార్తీకమాసం ప్రారంభమయ్యేలోగా ఈ రహదారిని బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



అధ్వానంగా ఉన్న సిద్దేశ్వరం క్షేత్రానికి వెళ్లే రహదారి



గండిపాళెం జలాశయంలో చేరిన వరద నీరు

'రాళ్లపాడు'లో
పెరుగుతున్న నీటిమట్టం

- ప్రాజెక్టులో 16.2 అడుగులకు చేరిన నీరు
- 'గండిపాళెంలోనూ వరద నీరు చేరిక
- సోమశిలకు తగ్గిన ప్రవాహం

- వివరాలు 6లో..



రాళ్లపాడు ప్రాజెక్టులో 16.2 అడుగులకు చేరిన నీటిమట్టం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవం ఆదివారం పురమందిరంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు, ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా ఈ కార్యక్రమాలు జరగ్గా, చివర్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)

బోగస్ హాజరుపై దృష్టి

పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై ప్రభుత్వం దృష్టి సారించింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, హాజరు అవకతవకలను గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. ఇప్పటి వరకు సాగిన అడ్డగోలు వ్యవహారం, ఇక సాగకుండా అడ్డుకట్ట వేసేలా తనిఖీలను ముమ్మరం చేయనుంది. దీంతో తమ అక్రమాలు వెలుగులోకి వస్తాయన్న భయంతో ఎయిడెడ్ విద్యాసంస్థల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

- ఇకపై పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- విద్యార్థుల నమోదు వివరాలపై ఆరా
- అక్రమాలు వెలుగులోకి వస్తాయని 'ఎయిడెడ్' నిర్వాహకుల ఆందోళన

నెల్లూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 ప్రభుత్వ బడులున్నాయి. వీటిలో 3.28 లక్షలమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొన్నటి వరకు హాజరుపట్టికలో పేరు నమోదుకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. వాస్తవంగా నమోదైన ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా బడి మెట్లు మాత్రం ఎక్కడంలేదు. దీంతో హాజరుశాతం చాలా తక్కువగా ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు తక్కువశాతం మంది హాజరవుతున్నా, 90 నుంచి 95శాతం మంది హాజరువుతున్నట్లు తప్పుడు సమాచారం నమోదు చేస్తున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయిలో ఎందుకిలా జరుగుతోందని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. రిజిస్టర్‌లో పేరు ఉన్నా, పాఠశాలలకు మాత్రం విద్యార్థులు రావడం లేదు.

తరగతి గదిలోకి వచ్చి పాఠాలు వినడంలేదని గుర్తించారు. దీనిపై ఉన్నత స్థాయిలో కసరత్తు చేయగా, అధిక ప్రాంతాల్లో బోగస్ బాగోతం సాగుతోందని ప్రాథమికంగా నిర్ధారించారు. విద్యార్థుల సంఖ్య కోసం అడ్డగోలుగా ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వెంటనే ఆకస్మిక తనిఖీలు చేపట్టి లోపాలను గుర్తించాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే దీనిపై ఎంఈవోలతో సమీక్ష నిర్వహించి వారం, పదిరోజుల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించి వాస్తవ నివేదికలు ఇవ్వాలని ఎంఈవోలకు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను కచ్చితంగా సందర్శించి బోగస్‌ను అరికట్టాలని స్పష్టమైన ఉత్తర్వులిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు, హాజరు పట్టికలో ఉన్న పేర్లకు చాలా వ్యత్యాసాలున్నట్లు ఇప్పటికే ఆరోపణలున్నాయి. హాజరు పట్టికలో పేరున్న ప్రతి విద్యార్థి బడిలో ఉండడంతో పాటు యూడైస్‌లో కచ్చితంగా నమోదై ఉండాలి. అయితే ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి అధికంగా రాజకీయ ఒత్తిళ్లను అధిగమించాల్సి ఉంటుందని ఓ అధికారి చెప్పడం విశేషం.



● ఎయిడెడ్‌లో విచారణ జరిగేనా ?

ఎయిడెడ్ పాఠశాలల్లో విచారణ సవ్యంగా జరిగేనా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాల బోధనకు పలు ఇబ్బందులు వస్తున్నాయని యాజమాన్య ప్రతినిధులు గత వైసీపీ ప్రభుత్వంలో ఖాళీల భర్తీకి అనుమతులు తెచ్చుకున్నారు. దీంతో ఈ నియామకాల్లో పెద్ద ఎత్తున లాబీయింగ్‌లతో పాటు లావాదేవీలు కూడా భారీగానే జరిగినట్లు బహిరంగ చర్చ జరిగింది. ఇది అందరికీ తెలిసినా రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగా అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అక్షర సత్యం.ఇక బడిలో ప్రవేశం పొందిన విద్యార్థులు వస్తున్నారా... లేదా ? అని తనిఖీలు చేసే పరిస్థితి ఉంటుందా..? అని విద్యాశాఖ సిబ్బంది తమ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం ఎయిడెడ్ విద్యాలయాలకు వెళ్లి ఒకసారి కాకుండా ఆకస్మికంగా మూడుసార్లు వేర్వేరుగా తనిఖీలు చేయాలని, లోపాలను గుర్తించి వాస్తవ నివేదికలను ఇవ్వాలని ఆదేశించారు. అయితే అధికారులు ఒత్తిడిని తట్టుకుని సమగ్రంగా వాస్తవ నివేదికలు ఇస్తారా ? లేక అంతా బాగుందని గతంలో మాదిరిగా సమాచారం అందిస్తారా ..? అన్న చర్చ జోరుగా సాగుతోంది..



తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రముఖుల నుంచి అవార్డు అందుకుంటూ..

నాట్య రంజని
భవ్యహాసిని

- భరతనాట్యంలో ఎన్నో సాహసోపేత ప్రదర్శనలు
- పలు రికార్డులు, అవార్డుల సొంతం
- చదువుల్లోనూ మేటి, కరాటేలోనూ రాణింపు

భరతనాట్య కళాకారిణిగా నెల్లూరు నగరానికి చెందిన నల్లంగు భవ్యహాసిని అసమాన ప్రతిభ కనబరుస్తోంది. ఆధ్యాత్మిక చింతన కలిగిన ఆమె పలు ఆలయాల సన్నిధిలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి 14ఏళ్లకే పలు ప్రపంచ రికార్డులు సాధించింది. ప్రస్తుతం ఆమె నగరంలోని అవెన్యూ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 9వతరగతి చదువుతోంది. ఊహ తెలిసిన నాటి నుంచి భవ్యహాసినిలో దైవభక్తి, నాట్యం పట్ల ఆసక్తి కనపరచడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు 2వతరగతిలోనే నృత్యశిక్షణకు పంపారు. కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేతలు ఈకే.కామాక్షి, ఈకే.సుబ్రహ్మణ్యం వద్ద భరతనాట్యంలో ఏడేళ్ల శిక్షణ పొందారు. భరతనాట్యంలో మెలకువలు వంట పట్టించుకున్న భవ్యహాసిని శిక్షణ సమయంలోనే నృత్య ప్రదర్శనలు చేయాలని సంకల్పించింది. ఆమె సంకల్పానికి తల్లిదండ్రులు, నాట్యగురువులు ప్రోత్సహించారు. దీంతో ఆమె పలు ప్రముఖ ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చింది.

● గంటల తరబడి ఏకధాటిగా ప్రదర్శన

మూడు గంటలసేపు నిర్విరామంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. దేవరపాలెం నరసింహకొండకు పైనుంచి కిందికి, కింది నుంచి పైకి మూడుసార్లు నృత్య ప్రదర్శనను సాహసోపేతంగా ప్రదర్శించింది. అలా ఆమె తన నాట్యంతో నరసింహ స్వామికి కళానీరాజనం అర్పించింది. అనంతరం నెల్లూరు పురమందిరంలో నిరంతరాయంగా నాలుగు గంటలసేపు నృత్య ప్రదర్శన చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. 2023లో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ఒకటిన్నర గంటలపాటు నృత్య ప్రదర్శన చేసి నటరాజ స్వామికి నృత్య నీరాజనం అర్పించింది. తమిళనాడులోని అరుణాచలంలో 14కి.మీల దూరం నృత్య ప్రదర్శనలు చేస్తూ గిరి ప్రదక్షిణ చేసింది. ఈ సందర్భంగా ఆమె పాదాలకు గాయాలయ్యాయి. అయినా వెరవక కఠోరదీక్ష, ఎనలేని భక్తిభావంలో 14 కి.మీల దూరం నృత్య ప్రదర్శనలను 3.36 గంటల్లో పూర్తి చేసింది. అరుణాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా నృత్య ప్రదర్శనలో పలువురు భక్తులు కూడా నృత్యాలు చేస్తూ ఆమెను ప్రోత్సహించారు.

● ఎన్నో అవార్డులు, రివార్డులు

భరతనాట్యంలో భవ్యహాసిని ఎన్నో రికార్డులు, అవార్డులు సాధించారు. గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా వరల్డ్ బుక్, నోబుల్ వరల్డ్ రికార్డులు ఆమెకు వచ్చాయి. 2023 అక్టోబరు 2న జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారు నెల్లూరు టయో అవార్డుని ఇచ్చి సత్కరించారు. 2024 జనవరి 26గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ నాట్యకారిణి ప్రశంసాపత్రం అందుకుంది. ఇదే స్ఫూర్తితో 2024లో మాలకొండకు భరతనాట్యం చేసుకుంటూ చేరుకుంది. ఎంతో దీక్షాదక్షతలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రికి భరతనాట్యం చేసుకుంటూ చేరుకుంది. 2024 ఆగస్టులో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన నృత్యకారంలో శ్రీకృష్ణదేవరాయ సమితివారు భవ్యహాసినిని నాట్యరంజిత బిరుదుతో సత్కరించారు. ఆమె నాట్యంతోపాటు చదువుల్లోనూ మేటిగానే ఉంది. అలాగే కరాటేలో బ్రౌన్-3 బెల్ట్ సాధించింది. గూడూరులో హిందూ ధర్మప్రచార సమితి నిర్వహించిన భగవద్గీతల శ్లోకాల పోటీలో కూడా మండల స్థాయి ప్రథమ బహుమతి సాధించింది.

\- నెల్లూరు, సాంస్కృతికం (ఆంధ్రజ్యోతి)


లక్ష్మీ అలంకారంలో భవ్యహాసిని

నా తల్లిదండ్రులు చెంచులక్ష్మి, ఎన్.సునీల్, నాట్యాచారులు ఈకే.కామాక్షి, సుబ్రహ్మణ్యం, అవెన్యూ స్కూలు యాజమాన్యం ప్రోత్సాహంతో భరతనాట్య కళాకారిణిగా గుర్తింపు పొందా. వారి స్ఫూర్తి, ఆశీస్సులతో భరతనాట్యం విశిష్టతను, హిందూ సనాతన ధర్మం గొప్పదనాన్ని, సంస్కృతిని విశ్వవ్యాప్తి చేయాలన్నదే తన ఆశయం.

హిందూ సంస్కృతిని విశ్వవ్యాప్తి చేయాలని...

\- నల్లంగు భవ్యహాసిని

చుక్కల భూముల
చిక్కులు తొలగేదెప్పుడు !

(5వ పేజీ తరువాయి)

పట్టా భూములుగా చలామణీ అయ్యే పరిస్థితిని కల్పించాల్సి ఉండగా కొన్నింటినే తొలగించడంతో అదే సమస్యగా కొనసాగుతోంది. దీంతో వేలాది ఎకరాలు నిషేధిత భూముల జాబితాలో ఉండిపోయాయి. దీనికి పూర్తిస్థాయిలో పరిష్కారాన్ని చూపించాలని రైతులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలి



కూటమి ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి సమస్యను పరిష్కరించుకునే పరిజ్ఞానం లేని రైతుల కోసం పూర్తిస్థాయిలో ఈ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలి

\- గోళ్ల ఆదాం, రైతు, గోగులపల్లి



అవసరమైనప్పుడు అమ్ముకోలేని దుస్థితి

చుక్కల భూముల సమస్య తీరిపోయిందని రెవెన్యూ అధికారులు చెప్తున్నా, ఎంతోమంది రైతులను ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. అవసరమైనప్పుడు ఈ భూములను విక్రయించుకోలేని పరిస్థితి నేడు నెలకొంది.

\-గంగపట్నం శీనయ్య, రైతు, ఇస్కపలి

ఏపీఐఐసీలో కుర్చీల ఖాళీ

(5వ పేజీ తరువాయి)

నెల్లూరు జిల్లాను మార్చారు. దీనిపై కూడా పారిశ్రామికవేత్తలనుంచి విమర్శలు వెల్లువెత్తడంతో మళ్లీ నెల్లూరుకు తిరిగి తీసుకువచ్చి జోనల్ కార్యాలయాన్ని పునరుద్ధరించారు. ఈ ప్రక్రియ పారిశ్రామిక విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. నెల్లూరు జోన్‌ను పునరుద్ధరించినా రెగ్యులర్ జెడ్ఎంను నియమించకుండా వైసీపీ ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. దీన్ని బట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వానికి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

● కీలక సమయం

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక రంగంపై దృష్టి సారించింది. కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు బహుశా అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటూ ఓ వైపు సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే చెపుతూ వస్తున్నారు, నూతన ఇండస్ట్రీయల్ పార్కులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. ఇదే సమయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఏటా 15శాతం గ్రోత్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు జిల్లాలో కృష్ణపట్నం స్మార్ట్‌సిటీ (క్రిస్‌సిటీ) నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. వీటన్నింటి నడుమ కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఈ సమయంలో ఏపీఐఐసీ కీలకంగా వ్యవహరిస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు లేకుండా, వేగంగా భూములు ఇవ్వగలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చు. అయితే అందుకు పూర్తిస్థాయిలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని పటిష్టం చేయాల్సి ఉంది. ఈవిషయంపై జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు, కలెక్టర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.







అట్టముక్కలతో రూపొందించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలు, వినాయకుడి విగ్రహం, శ్రీజ్వాలాముఖి అమ్మవారి విగ్రహం

అట్టముక్కలతో
అద్భుతాలు !

'కిడాంబి' కళాఖండాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తితో ఆయన సృష్టించిన అద్భుతాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనేందుకు ఇది ఒక నిదర్శనం. నెల్లూరు నగరానికి చెందిన పాత పుస్తకాల విక్రయశాల 'సంతానం బుక్ స్టాల్' అధినేత కిడాంబి నరసింహన్ తన తండ్రి కాలం నుంచే పాత పుస్తకాల వ్యాపారం చేస్తున్నా, ప్రవృత్తిగా చిత్రలేఖనంపై దృష్టి సారించారు. కళాత్మక నైపుణ్యం ఉట్టిపడేలా దేవతామూర్తుల చిత్రాలను అద్భుతంగా వేయడంతోపాటు మంచి కళాఖండాలను రూపొందించేవారు. సొంతంగానే చిత్రలేఖనంపై మంచి పట్టు సాధించి చిత్రకారుడిగా, శిల్పిగా గుర్తింపు పొంది పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఆయన గీసిన చిత్రాలకు రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు దక్కాయి. శిల్పకళలో కూడా ప్రవేశమున్న నరసింహన్ అట్టముక్కలతో 2.5 అడుగుల ఎత్తు, 18 కిలోల బరువుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను అద్భుతంగా తయారు చేశారు. ఈ విగ్రహాల తయారీకి ఆరు నెలల సమయం పట్టింది. అదే అట్టముక్కలతో కళ్లు మెరిసేలా శ్రీవారి వజ్రాభరణాలు, 20 కిలోల అట్టలతో శ్రీవారి సుదర్శన చక్రాన్ని తయారు చేసి మెప్పించారు. ఇవి చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. వీటితోపాటు గణనాథుడు విగ్రహం, జ్వాలాముఖి అమ్మవారి చిత్రపటం రూపొందించారు.

● జాతీయ చిహ్నం..

మూడు నెలలు శ్రమించి రెండు అడుగుల ఎత్తులో భారతదేశ జాతీయ చిహ్నన్ని సైతం అట్టముక్కలతో తయారు చేశారు.

● త్యాగరాజస్వామి విగ్రహ రూపకల్పనకు..

నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవ సభకు వచ్చే ఏడాదితో 60 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా అట్ట ముక్కలతో త్యాగరాజ స్వామి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. అందుకు సంబంధించి నమూనా చిత్రాన్ని వేశారు. అలాగే శ్రీ భగవద్రామానుజుల సహస్రాబ్ధి ఉత్సవాల సమయంలో రామానుజుల విగ్రహాన్ని 30 కిలోల అట్టను వినియోగించి బంగారు విగ్రహంలా రూపొందించారు.శిల్పకళ ప్రావీణ్యంతో అట్టముక్కలతో అద్భుత కళాఖండాలు తయారు చేయటంతో 2020లో నరసింహన్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. 2021లో ఇంటర్నేషనల్ అచివ్‌మెంట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

\- నెల్లూరు, హరనాథపురం, (ఆంధ్రజ్యోతి)

త్యాగరాజస్వామి విగ్రహంపై దృష్టి పెట్టా



చిన్నతనం నుంచి చిత్రకళపై ఆసక్తితో సొంతంగానే చిత్రకళను నేర్చుకున్నా, అట్టముక్కలతో దేవతామూర్తుల విగ్రహాలు తయారు చేస్తున్నా, శ్రీవేంకటేశ్వరస్వామి దయతో ఆ కళలో కూడా మంచి ప్రావీణ్యం సాధించా. త్యాగరాజస్మరణోత్సవ సభను దృష్టిలో పెట్టుకుని అట్టముక్కలతో త్యాగరాజస్వామి విగ్రహం తయారీపై దృష్టి సారించా. ఇందుకు సంబంధించి చిత్రాన్ని రూపొందించుకున్నా.

\- కిడాంబి నరసింహన్, చిత్రకారుడు, శిల్పి

అర్బన్ తహసీల్దారు కార్యాలయం



రాజసాన్ని ఒలికించే కలెక్టరేట్

ఆంగ్లేయుల కాలంనాటి జ్ఞాపకాలను పదిలం చేసుకున్న పాత ఎస్పీ కార్యాలయం

చెక్కు చెదరని తహసీల్దారు కార్యాలయం

ఇప్పటికీ పటిష్టంగా ఉన్న కలెక్టర్ కార్యాలయ భవనం లోపలి భాగం




బ్రిటీషర్ల నిర్మాణ శైలికి నిదర్శనం ఏబీఎం బిల్డింగ్


అలనాటి కట్టడాలకు తార్కాణంగా పాత ఎస్పీ ఆఫీసు

నేటికీ తరగని
ప్రాచీన సంపద

నెల్లూరు నగరంలో ఎన్నెన్నో పురాతన భవనాలు

అవి నిత్యం మనకు కనిపించే భవనాలే. శతాబ్దాల తరబడి నిత్యం వందలాదిమంది సందర్శించే భవంతులే. కానీ వాటిని ప్రజలు కలెక్టరేట్ అని, ఎస్పీ ఆఫీసు అని, తహసీల్దార్ కార్యాలయమనే దృష్టితోనే చూశారు తప్ప... హుందాగా, పటిష్టంగా నిలబడిన అలనాటి కట్టడాల వెనుక దాగున్న సౌందర్యాన్ని, శ్రమను గుర్తించలేదు. అవన్నీ మన ప్రాచీన సంపదనే దృష్టితో చూసేవారు చాలా తక్కువమందే. కార్యాలయాలన్న విషయాన్ని పక్కనపెట్టితే ఆ పురాతన కట్టడాలు మన ప్రాచీన సంపదకు చిహ్నాలు. 200 ఏళ్ల క్రితం మన పూర్వీకుల వృత్తి నైపుణ్యానికి తార్కాణాలు. అలనాటి శ్రమ సౌందర్యం ఎంత బలంగా ఉండేదో చాటిచెప్పే ఆనవాళ్లు. అవే నెల్లూరు నగరంలోని పురాతన భవనాలు.

● కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉనికిని పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కానీ దాని చరిత్రను మాత్రం నేటి తరానికి గుర్తు చేయాల్సిందే. సున్నపు పూత మధ్య నిగనిగలాడుతూ నిలబడ్డ ఎర్రటి ఇటుక రాళ్ల వయసెంతో చెప్పి తీరాల్సిందే. బ్రిటీష్‌కాలంలోనే నెల్లూరు జిల్లా ఏర్పడింది. తొలిరోజుల్లో సర్వేపల్లి కోటలో కలెక్టర్ కార్యా లయం నడిచేది. జిల్లా తొలికలెక్టర్ జేజే కాటన్‌గా చెబుతారు. ప్రజలు అప్పట్లో కలెక్టర్‌ను దొర అని పిలిచేవారు. 1906లో నెల్లూరు నగరంలో కలెక్టరేట్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. 1915 వరకు (అంటే తొమ్మిదేళ్ల కాలం) ఈ కట్టడం నిర్మాణాలు జరిగాయని చెబుతారు. 1915లో కలెక్టరేట్‌ను ప్రారంభించారు. తొలి కలెక్టర్ జేజే కాటన్ నుంచి ఇప్పటి వరకు 95 మంది కలెక్టర్లు ఈ భవనాన్ని కేంద్రంగా చేసుకొని పాలన సాగించారు. కలెక్టరేట్‌లోని పట్టిక ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న కలెక్టర్ ఓ. ఆనంద్ 96వ కలెక్టర్. ఈ భవనం నిర్మించి ఇప్పటికి 109 సంవత్సరాలు అవుతోంది. అయినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. గోడలకు పేర్చిన ఎర్ర ఇటుకల బలిమి ఏమాత్రం తగ్గలేదు.


జిల్లా ట్రెజరీ కార్యాలయం

● పాత ఎస్పీ ఆఫీసు

పాత ఎస్పీ కార్యాలయం నిర్మాణం కూడా 1905లోనే మొదలయ్యింది. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం సముద్ర తీరానికి అనుకుని ఉన్న విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలను ఏకకాలంలో నిర్మించాయి. బ్రిటీష్ హయాంలో ఎస్పీలను పోలీస్ చీఫ్‌గా పిలిచేవారు. 1956 నుంచి ఎస్పీలుగా వ్యవహరిస్తున్నారు. ఈ భవనానికి కలెక్టరేట్ భవనానికి ఉన్నంత వయసే ఉంది. అయినా కృంగి పోలేదు. ఒంగిపోలేదు. పట్టు కూడా సడలలేదు.

● అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఇది కూడా 1906 ప్రాంతంలోనే నిర్మాణం జరిగింది. బ్రిటీష్ కాలంలో ఇది తాలూకా కార్యాలయంగా ఉండేది. ఈ భవనానికి ఇప్పటికి శతాధిక వసంతాల వయసే. అయినా నేటికీ చెక్కు చెదరలేదు. నిర్వహణ లోపం కారణంగా భవనాల్లో అక్కడక్కడా సమస్యలు కనిపిస్తుండవచ్చునేమో కానీ, పటిష్టత విషయంలో నేటి ఉక్కు యుగానికి కన్నా అప్పటి సున్నం యుగమే బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే నెల్లూరు నగరంలో చాలా భవనాలే నాటి చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి.

\-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

'రాళ్లపాడు'లో పెరుగుతున్న నీటిమట్టం

లింగసముద్రం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిప్రవాహం రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రాజెక్టులో నీటిమట్టం 16.2 అడుగులకు చేరింది. పాజెక్టు ఎగువన కురిసిన వర్షాలకు నీటిప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 900 కూసెక్కుల మేర నీరు వస్తుందని అధికారులు తెలిపారు. అయితే ఈనెల 22న మరో అల్పపీడనం ఏర్పడి, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాగా పూర్తిస్థాయి నీటిమట్టం 20 అడుగులు.

● గండిపాళెంలో 11.5 అడుగులకు...

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయంలో 11.5 అడుగులకు నీటిమట్టం చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి 220 క్యూసెక్కుల వరద ప్రవహం వస్తుందన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులు కాగా, ప్రస్తుతం 11.5 అడుగులకు నీరు చేరిందన్నారు.

● సోమశిలకు తగ్గిన వరద

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం 32,116 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఆదివారం సాయంత్రానికి 18,734 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 59.415 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 40 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో 36.3టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు నీటి మట్టం 36.3టీఎంసీలకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేరకు నీటిమట్టం పెరిగింది. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 175 క్యూసెక్కులుగా ఉందని ఈఈ కట్ట తిరుమలయ్య తెలిపారు.



మూలకు చేరిన 'చెత్త'

ఇళ్ల నుంచి వచ్చే చెత్తను పారిశుధ్య కార్మికులకు అందజేసేందుకు ఉపయోగపడాల్సిన బుట్టలు ప్రభుత్వ కార్యాలయంలో నిరుపయోగంగా మూలనపడి ఉన్నాయి. 2018లో టీడీపీ ప్రభుత్వం ఇంటికి రెండేసి చెత్త బుట్టలను అందజేసింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికలకు ముందు పచ్చ, నీలం రంగులు కలిగిన చెత్త బుట్టలను పంపిణీ చేయాలని ఆదేశించింది. మండలానికి బుట్టలు వచ్చే సరికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పంపిణీ నిలిపివేశారు. ఆగస్టు 15న అన్ని పంచాయతీల్లో చెత్తబుట్టలు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. మండలంలో అన్ని గ్రామాల్లో బుట్టలు పంపిణీ చేసినా మనుబోలులో మాత్రం పంపిణీ జరగనేలేదు. దీంతో చెత్తబుట్టలు లేక తడి, పొడి చెత్తను ఒకటిచేసి ప్రజలు రోడ్లపై పోస్తున్నారు.

- మనుబోలు(ఆంధ్రజ్యోతి)



దుర్గంపై పర్యాటకుల సందడి

ఇటీవల కురిసిన వర్షాలకు ఉదయగిరి దుర్గంపై సల్వాపేట్ జలపాతం, సెలయేళ్లు జాలువారుతుండడంతో వాటిని కనులారా వీక్షించేందుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. చెక్‌డ్యాం, సెలయేర్లలో సేదతీరుతూ ఆనందంగా గడిపారు. దుర్గం కొండల పచ్చటి అందాలను, పారే సెలయేళ్లను తిలకిస్తూ.. పక్షుల కిలకిల రావాలను ఆలకిస్తూ.. ప్రకృతి రమణీయతకు మంత్రముగ్ధులయ్యారు. ఉదయగిరి పట్టణంతోపాటు నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు, కావలి, పామూరు, బద్వేల్ తదితర ప్రాంతాల నుంచి పిల్లాపాపలతో ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి వెలుగొండ అందాలను అస్వాదిస్తూ మైమరిచిపోయారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



తగిలితే ప్రాణం పోదా..?



ఈ ఫొటోలోని చిత్రాలు చూస్తే గుండె గుభేల్‌మంటుంది. ఇదెక్కడో మారుమూల పల్లెలో కాదండోయ్.. మండలకేంద్రమైన మనుబోలు తూర్పు గిరిజనకాలనీలో దుస్థితి. కరెంటు స్తంభాలకు ఉండాల్సిన తీగలు కర్రలపైనే చేతికందే ఎత్తులో వేలాడుతోన్నాయి. అదికూడా నిత్యం ప్రజలు నడిచే రోడ్డుకి అడ్డంగా ఉండడం గమనర్హం. మరో పక్క దూరంగా ఉన్న కరెంటు స్తంభం నుంచి ఇళ్లకు లాగిన సర్వీసు వైర్లు కర్రల ఆధారంగా రోడ్డు పక్కన నీటిలో మునిగి వేలాడుతున్నాయి. గత కొంత కాలంగా ఉన్న ఈ పరిస్థితితో ఏక్షణమైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు పోవాల్సిందే. విద్యుత్ శాఖ అధికారులు ఈ పరిస్థితిని చూసి వెళుతున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు.

- మనుబోలు(ఆంధ్రజ్యోతి)

చిల్లర దుకాణంలో చోరీ

కావలి రూరల్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వెంగళరావునగర్ వినాయక టెంపుల్ సమీపంలోని చీతిరాల సుబ్బారావు చిల్లర దుకాణంలో చోరీ జరిగిందని బాధితుడు ఆదివారం గుర్తించి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి తలుపుకు వేసిన రెండు తాళాలు పగలగొట్టి దుకాణంలోకి ప్రవేశించి కలెక్షన్ కట్టేందుకు గల్లా పెట్టిలో ఉంచిన రూ.20,000 అపహరించుకు పోయినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెదనాన్నకు కుమార్తె దహన సంస్కారాలు



పెద్దనాన్నకు దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె

సంగం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగంలో ఓ యువతి తన పెద నాన్నకు దహన సంస్కారాలు చేసిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన కొరిమెర్ల వెంకటేశ్వర రావు (70) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన తల్లిదండ్రులది సంగం గ్రామం. బంధువులంతా సంగంలోనే ఉన్నారు. ఈయనకు వివాహం కాలేదు. కాగా, జీవనోపాధి కోసం చాలా ఏళ్ల కిందట హైదరాబాదు వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనను బంధువులు నెల్లూరు నారాయణ వైద్యశాలకు తీసుకువచ్చి వైద్య చేయించారు. ఆరోగ్యం విషమించడంతో ఇక లాభం లేదని ఇంటికి తీసుకెళ్లమన్నారు. దీంతో సంగంలో ఉన్న సోదరుడు శ్రీనివాసులు చౌదరి ఇంటికి తీసుకురాగా ఆదివారం మృతిచెందాడు. అయితే సంగంలో ఉండే సోదరుడు అనారోగ్యంతో తిరుపతిలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మిగిలిన సోదరులు, కుమారులున్నా దూరప్రాంతంలో ఉండడంతో సోదరుడు శ్రీనివాసులు చౌదరి కుమార్తె పద్మావతి అంత్యక్రియల్లో భాగంగా దహన సంస్కారాలు చేశారు. ఓ యువతి దహన సంస్కారాలు చేయడంతో స్థానికులు, బంధువులు వింతగా చూశారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



మృతిచెందిన సురేష్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకిందపల్లి కంకర క్రషర్ వద్ద విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేల్ మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన పెద్దులపల్లి సురేష్ (27) గత కొన్ని రోజులుగా కంకర క్రషర్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో క్రషర్ వద్ద టిప్పర్‌లో ఉన్న టైర్లను దించేందుకు లిఫ్టును పైకిలేపాడు. దీంతో పైనున్న విద్యుత్ తీగలు టిప్పర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కంకర క్రషర్‌లో పనిచేస్తున్నవారు గమనించి చికిత్స నిమిత్తం వింజమూరులోని వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రాపూరు మాజీ ఎంపీపీ పాపకన్ను మృతి

రాపూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సీనియర్ వైసీపీ నాయకుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. హుందా రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం ఆయన. రాపూరు పెద్దాయన పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి మృతిచెందారన్న విషయం తెలియ డంతో మండల ప్రజలు విషాదంలో మునిగిపోయారు. ఆయన గతంలో రాపూరు సమితి అధ్యక్షుడిగా, రాపూరు ఎంపీపీగా పనిచేశారు.

మైపాడు బీచ్‌లో మహిళ మృతదేహం

ఇందుకూరుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు సముద్రం తీరంలో అర్ధనగ్నంగా ఉన్న ఓ మహిళ మృతదేహం ఆదివారం ఉదయం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన అన్నం ప్రమీల కుటుంబకలహాలతో ఇంట్లో నుంచి అదృశ్యమైందని, స్థానికులు కొందరు మైపాడు బీచ్‌లో చూసినట్లు చెప్పారంటూ ఆమె కుటుంబ సభ్యులు శనివారం ఇందుకూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహం చూసిన వెంటనే ఎస్‌ఐ ఫిర్యాదు దారులకు సమాచారం ఇచ్చి ఘటనా స్థలికి పిలిపించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆ మృతదేహం అన్నం ప్రమీలదిగా గుర్తించారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ వెంట ఏఎస్‌ఐ రాజు, తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి పడి ఒకరికి గాయాలు

వెంకటాచలం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం మోటర్ బైక్ అదుపుతప్పి ఒకరు గాయపడ్డారు. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన రవికుమార్ పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రవికుమార్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7498
వెండి కిలో ధర	రూ. 99,300
వెండి ఒక గ్రాము	రూ.102.30

కోడిపందెం స్థావరంపై దాడి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగులవారి చెరువుపల్లి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులు, రెండు కోళ్లు, రూ.3.300 నగదు, పది మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో సీతారామపురం, మర్రిపాడు ఎస్‌ఐలు శివకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రటి ఎండలోనూ... జోరున కురిసే వానలోనూ... వణికించే చలిలోనూ... పగలూ రాత్రి అన్న తేడా లేకుండా 24గంటలు తమ కోసం కాకుండా ప్రజల కోసం బతికేవారే పోలీసులు. విధి నిర్వ హణలో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, శాంతిభద్రతలే లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తూ ప్రాణాలను సైతం వదులుతున్న పోలీసుల సేవలు ఎంత చెప్పినా తక్కువే. ఈ సంవత్సరం 12 మంది పోలీసులు విధులు నిర్వహిస్తూ ప్రాణాలు విడిచారు. నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సంద ర్భంగా ప్రత్యేక కథనం....

అమరవీరుల త్యాగం అజరామరం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

- ప్రాణాలు పోతున్నా ప్రజల రక్షణే లక్ష్యం
- ఈ ఏడాది 12 మంది అమరులు



నెల్లూరు : పోలీసు కవాతు మైదానంలోని పోలీసు అమరవీరుల స్తూపం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్‌చిన్ ప్రాంతంలో సముద్ర మట్టానికి 16వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్య ఉన్న వేడినీటిబుగ్గ (హాట్ స్ప్రింగ్) అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. దేశ వ్యాప్తంగా అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబరు 21వ తేదీని పోలీసుల అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం ఈ పవిత్రస్థలం నుంచే ఆరంభమైంది. 1959 అక్టోబరు 21వతేదీన డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో 21మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్‌పీఎఫ్ దళం హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసు వీరుల రక్తంతో తడిచిన హాట్‌స్ప్రింగ్ నెత్తుటిబుగ్గగా మారి పవిత్ర స్థలంగా రూపుదిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడినబృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులర్పించడం ఆనవాయితీ.జిల్లాలో అక్రమాలపై ఉక్కుపాదం మోపి శాంతిభద్రతల పరిరక్షణలో, విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులెందరో ఉన్నారు.

ఈ ఏడాది 12 మంది మృతి

గత అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు వివిధ కారణాలతో విధుల్లో ఉన్న 12 మంది పోలీసులు మృతి చెందారు. గతేడాది నవంబరు 12న బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ జీ రామారావు మృతి చెందారు. ఈ సంవత్సరం జనవరి 17న ఇందుకూరుపేటలో విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుల్ టీ శ్రీనివా సులు, జనవరి 21న వీఆర్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ఎం ధనుంజయ, ఫిబ్రవరి 12న వింజమూరులో విధులు నిర్వహిస్తూ వైవీ సుబ్రమణ్యం మృతిచెందారు. డీపీవోలో విధులు నిర్వహిస్తూ ఏ సుబ్రహ్మణ్యం జూన్ 5వ తేదీ మృతి చెందారు. ఎస్‌ఆర్ పురంలో విధులు నిర్వహిస్తూ ఏఎస్‌ఐ ఎస్‌కే రఫి హకీమ్ జూన్ 15న మరణించారు. డీఏఆర్‌లో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ ఎం రమేష్ జూలై 25వ తేదీ అసువులుబాశారు. ఇందుకూరుపేటలో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ వైఎస్‌ఎం కృష్ణ జూలై 26న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. డీఏఆర్‌లో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ టీ వెంకట సుధీర్ ఆగస్టు 7న ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. డీఏఆర్‌లో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ జే హరికృష్ణ ఆగస్టు 8వ తేదీ, ఏఆర్ కానిస్టేబుల్ యు శివకుమార్ సెప్టెంబరు 14న మృతి చెందారు. ఏఎస్‌పేటలో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ వై రమేష్ సెప్టెంబరు 18న ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఈ ఏడాది మృతి చెందిన పోలీసు అమర వీరులకు సోమవారం పోలీసు కవాతు మైదానంలో ఘనంగా నివాళులు అర్పించనుంది.

వారోత్సవాలను విజయవంతం చేయండి



జిల్లాలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి అనంతరం ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. 22 నుంచి 31వ తేదీ వరకు పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ నెల 31వ తేదీ ఏక్తా దివాస్ సందర్భంగా సమైక్యత భావాన్ని చాటుతూ ప్రజల సహకారంతో జిల్లా వ్యాప్తంగా సమైక్యతా పరుగు నిర్వహిస్తామన్నారు.

- ఎస్పీ కృష్ణకాంత్

ఎన్నికల హామీల అమలే ప్రభుత్వ లక్ష్యం

- దీపావళికి మహాశక్తి పథకంలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ
- మంత్రి ఆనం



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంగం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని దేవదాయ, ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సంగం, చేజర్ల మండల నాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. త్వరలో దీపావళి కానుకగా ఆడపడుచులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందచేయనున్నారు. ఎన్నికల హామీల అమలుతోపాటు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు సభ్యత నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల సభ్యతానికి రూ. 100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని చెప్పారు. ఇకనుంచి ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు పరిశీలకులు కార్తీక్, రాష్ట్ర నాయకులు సుఖవాసి శ్రీనివాస్, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, రెండు మండలాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు



కబడ్డీ విన్నర్స్‌కు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాల డాక్టర్ డీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు జరిగిన విక్రమ సింహపురి యూనివర్శిటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వీఎస్‌యూ జట్టుకు ఎంపిక చేశారు. వీరు త్వరలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీల్లో వీఎస్‌యూ తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, టోర్నమెంట్ అబ్జర్వర్ రవీంద్రబాబు పాల్గొని విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

విజేతలు వీరే..

టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ విన్నర్‌గా మేఘన(జేబీ) రన్నర్‌గా చంద్రిక(వీఎస్‌యూ నెల్లూరు), డబుల్స్‌లో విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా డీకేడబ్ల్యు జట్లు నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ విన్నర్‌గా రాజేశ్వరి(జెనెక్స్) రన్నర్‌గా దేవి (కెసీడీసీ), డబుల్స్ విన్నర్‌గా జెనెక్స్ రన్నర్స్‌గా డీకేడబ్ల్యు నిలిచారు. టెన్నిస్ సింగిల్స్ విన్నర్‌గా మేఘన (జేబీ) రన్నర్‌గా (శ్రీసాయి కావలి), డబుల్స్ విన్నర్‌గా (డీకె డబ్ల్యు నెల్లూరు) రన్నర్‌గా (జేబీ కావలి) నిలిచాయి.

పురుషుల విభాగంలో..

కబడ్డీలో విన్నర్‌గా ఆత్మకూరు ఎస్‌ఆర్‌జే కళాశాల, రన్నర్‌గా కావలి శ్రీసాయి కళాశాల జట్లు నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విన్నర్‌గా రాజేష్ (జేబీ) రన్నర్‌గా బాలాజీ(కెసీడీసీ), డబుల్స్ విన్నర్‌గా జేబీ, రన్నర్స్‌గా కేసీడీసీ జట్లు నిలిచాయి. టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విన్నర్‌గా హేమంత్ (జేబీ), డబుల్స్ విన్నర్స్‌గా జేబీ రన్నర్స్‌గా వీఎస్‌యు నెల్లూరు జట్లు నిలిచాయి. టెన్నిస్ విన్నర్‌గా హేమంత్ (జేబీ), రన్నర్‌గా హేమాంజనేయులు (వీఎస్‌యు), డబుల్స్ విన్నర్స్‌గా జేబీ రన్నర్స్‌గా డీఆర్‌డబ్ల్యు జట్లు నిలిచాయి.

పర్యవేక్షణ లోపం.. శుభ్రత శూన్యం !

- మాంసం విక్రయాలపై తనిఖీలు కరువు



పొదలకూరులోని మాంసం దుకాణాలు

పొదలకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కోళ్లు, జీవాల వధపై పంచాయతీ, పశు వైద్యశాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యాధుల బారిన పడిన జీవాల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొదలకూరులో పొట్టేలు, మేక మాంసం కిలో రూ.800 నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారు. కోడి మాంసం కిలో రూ.200 నుంచి రూ. 230 విక్రయిస్తున్నారు. ఇంత సొమ్ము చెల్లించి కొనుగోలు చేస్తున్నప్పటికీ శుభ్రమైన, నాణ్యమైన మాంసం లభించడం లేదు. మాంసం విక్రయించే దుకాణాలు అసలు పరిశుభ్రతను పాటించట్లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మురికికూపంగా అపరిశుభ్రత వాతావరణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దుకాణాలపై అధికారులు తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వ్యాపారులు జీవాలను వధించే ముందు పశు వైద్యాధికారితో పరీక్షలు చేయించి ఆయన ధ్రువీకరించిన తరువాతే వధించాని కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు పరీక్షలు నిర్వహించే వైద్యులు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడే విక్రయాలు చేపడుతున్నారు. వ్యాధులతో చనిపోతున్న వాటిని యథేచ్ఛగా కోస్తూ విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిపై మండల అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.

ట్యాలీప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్, సైబర్ గ్రామీణ కంప్యూటర్ శిక్షణ సంస్థలో ఈనెల 24నుంచి ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఫైనాన్షియల్ అకౌంటింగ్ సెక్టార్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు గల ఈ ట్యాలీప్రైమ్ కోర్సులో శిక్షణ పొందేందుకు బీకామ్/ఎంకామ్, బీబీఏ/ఎంబీఏ చదివి, 18నుంచి 35సం,ల మధ్యవయసుగల ఉభయ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. కోర్సు కాలవ్యవధి రెండునెలలుంటుందని, శిక్షణ కాలంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు భోజన, వసతి సౌకర్యాలు పూర్తిగా ఉచితమన్నారు. వివరాలకు 9100033552, 9440630051 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కేజీబీవీ ఉద్యోగాల వెరిఫికేషన్‌కు నేడే ఆఖరు

నెల్లూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 12 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో సిబ్బంది ఖాళీల భర్తీకి సంబంధించి దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన గడువు సోమవారంతో ముగియనుందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీల్లో పీజీటీ 16, సీఆర్‌టీ 7, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 కలిపి మొత్తం 31 పోస్టులున్నాయన్నారు. వీటికి ఇప్పటి వరకు 498 మంది దరఖాస్తు చేసుకున్నారని, 60శాతం మంది సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయిందని తెలిపారు. మిగిలిన అభ్యర్థులంద రూ సోమవారం తప్పక వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. గడువు పూర్తయిన తరువాత వెరిఫికేషన్‌కు అంగీకరించమని స్పష్టం చేశారు.

రేపు డీకే కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచిం చారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8143227239, 8639867407 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలోని సాతానుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, విగ్రహాల ధ్యానాదివాసము భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన ప్రసాదం వితరణ గావించారు. శ్రీ సాంబశివ చారిటబల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పూనుగుంట రేవతి, పలువురు గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధ్యాన సాధనపై అవగాహన

వింజమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యాపకాలను తగ్గించుకొని ఆధ్యాత్మికత పెంపొందించుకోవాలని పిరమిడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యాన సాధనపై అవగాహన కల్పించారు. ఈనెల 27వ తేదీన శ్రీకాళహస్తి సూపర్ గ్రాండ్ మాస్టర్ ముని బాబుస్వామి ఆత్మజ్ఞాన తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాకాహారం ప్రాముఖ్యతను గురించి నినాదాలు చేస్తూ కరపత్రాలు పంచుతూ వైశ్యబజార్, పిరమిడ్ నగర్, పోలేరమ్మగుడి బజార్, కుమ్మరి బజారుల మీదుగా మహాకరుణ - శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ దొరసాని, హేమలత, స్వరాజ్యం, రాజేశ్వరి, ధ్యానులు పాల్గొన్నారు.

స్టీఫెన్‌కుమార్‌కు సన్మానం



స్టీఫెన్‌కుమార్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో చిరు ఉద్యోగిగా పనిచేస్తూ సమాజిక సేవలు చేస్తున్న ఎం.స్టీఫెన్ కుమార్‌ను ఆదివారం బిట్రగుంట రైల్వే క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు యాదవ్, సత్యనారాయణ చార్యులు, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు, అధ్యక్షుడు స్వర్ణస్‌రాజ్, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న వెంకట్రామయ్య, డాక్టర్ శ్రీధర్

కావలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) స్థానిక తపాలాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యార్థులకు ఆదివారం దీన్‌దయాళ్ స్పర్శయోజన క్విజ్ పోటీలు నిర్వహించారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి రైటింగ్‌ప్యాడ్, పెన్‌ను చవేరా ఫర్నిచర్ అధినేత చెన్నా వెంకట్రామయ్య చేతుల మీదుగా అందచేశారు.

హైవే ప్రయాణమంటే హడల్

- శిథిలావస్థలో వంతెనలు
- భయాందోళనలో ప్రయాణికులు



భోగ్యంవారిపల్లి వద్ద ఇనుప చువ్వలు కనిపిస్తున్న వంతెన

వరికుంటపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి శివారున ఉన్న మండలాల్లో జాతీయ రహదారులపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ప్రధానంగా వరికుంటపాడు, దుత్తలూరు మండలాల మీదుగా సాగిన 565 జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆ మార్గంలోని పలు గ్రామాల రహదారి వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఎన్నో ఏళ్ల తరబడి నిర్మించిన ఆ వంతెనలు శిథిలావస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహదారులు ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఉప్పువాగుపై నిర్మించిన వంతెన గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దుత్తలూరు మండలం తెడ్డుపాడు సమీపంలోని వంతెన పరిస్థితి సైతం అలాగే దాపురించింది. ప్రతినిత్యం ఆ మార్గంలో విజయవాడ, కడప, బెంగళూరు, నెల్లూరు, చెన్నై, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర ప్రాంతాలకు సైతం అధిక సంఖ్యలోనే ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు పరుగులు తీస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఆ వంతెన మరింతగా దెబ్బతిని ఇనుప చువ్వలు సైతం బయటకు కనిపిస్తూ కూలే దశకు చేరడంతో భారీ వాహనాల సంగతి అటుంచితే కనీసం ఆటోలు, మోటారుబైకలు వంటి చిన్నపాటి వాహనాల్లో వెళ్లాలంటేనే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. కాగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉంటుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనలతో పాటు అధ్వానంగా మారిన జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

గండి పూడ్చివేత



ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు

కొండాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి గ్రామానికి చెందిన గండికట్ల చెరువుకు పడిన గండిని అధికారులు, రైతులు తాత్కాలికంగా పూడ్చారు. శనివారం గండిపడిన ప్రాంతంలో రింగు బండ్‌ను ఏర్పాటు చేయగా, ఆదివారం ఇసుక బస్తాలు వేసినట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ కుమార్ తెలిపారు. దీంతో చెరువు నుంచి నీరు వృథాగా పోకుండా కాపాడటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గండిని పూడ్చేందుకు సహకరించిన స్థానిక నాయకులు, ఆయకట్టు రైతులకు ఇరిగేషన్ అధికారులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధికి సూచికలు రహదారులు

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి సూచికలు రహదారులని, నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రహదారుల నిర్మాణం చేపడతామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నర్రవాడ, కొత్తపేట, దుత్తలూరు పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి రూ. 1.47 కోట్ల ఉపాధి హామీ నిధులతో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతోందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుదామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉండేలా గురవారెడ్డి, ఏపీడీ గాయత్రీ, ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, డీఈ మణికుమార్, ఏఈ రవీంద్రనాథ్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దివ్యాంగులకు దుప్పట్లు, చికెన్ బిర్యానీ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

కావలిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బందిపడ్డ ముసునూరు దివ్యాంగుల కాలనీలోని దివ్యాంగులకు హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, బిర్యానీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రూరల్ ఎస్సై బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయమన్నారు. దివ్యాంగుల ఇబ్బందులను దివ్యాంగుల హక్కుల వేదిక నేత మండవ వెంకట్రావు తన దృష్టికి తేవడంతో దాత గౌస్ బాషా సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు సయ్యద్ గనీ బాషా అన్నారు. ఈ కార్యక్రమంలో చూపూరు ప్రభయ్య, చాన్‌బాషా, కానిస్టేబుల్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి

యూటీఎఫ్ నిరంతర పోరాటం



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

లింగసముద్రం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతిశర్మ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా ఆదివారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో మండల యూటీఎఫ్ సమావేశం ఆశాఖ సంఘం నాయకురాలు సరోజిని అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ క్రమశిక్షణ కలిగిన సంస్థ అని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతోందన్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు జి వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, అంకయ్యలతోపాటు, ప్రధానోపాధ్యాయులు యు మాధవరావు, సూర్యప్రకాశరావు, శ్రీనివాసరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు గొర్రెపాటి సాంబయ్య తన కుమారుని జ్ఞాపకార్థం ఉపాధ్యాయులకు బ్యాగులను అందజేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా వై రామచంద్రయ్య, అధ్యక్షుడిగా ఎస్ సూర్యనారాయణ, సహాధ్యక్షులుగా ఆర్ వెంకటకృష్ణ, ఎస్ శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా టి సుధాకర్‌రావు, కోశాధికారిగా కె మహేంద్రలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే ఇంటూరి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పందలపాడు, కోవూరు గ్రామాల్లో పల్లెపండుగ కార్య క్రమం చేపట్టారు. అందులో భాగంగా పందల పాడు పంచాయతీలో రూ.10.06 లక్షల నిధులు, కోవూరు పంచాయతీలో రూ.24.45 లక్షలతో నూతన సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా సాగర్ జలాలను త్వరలోనే అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నార్నే రోశయ్య పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రతన్ జ్యోతి, తహసీల్దారు ఇక్బాల్, టీడీపీ నాయకులు కూనం సుబ్బారెడ్డి, జీ మోషే, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని పందలపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

టీడీపీ నేత మృతికి సంతాపం


మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గోగినేని శివరామయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శివరామయ్య మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జోరుగా పేకాట శిబిరాలు

- పట్టించుకోని పోలీసులు

ఉలవపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. కృష్ణాపురం, బద్దిపూడి గ్రామాల మామిడి తోటల్లో నిర్వహిస్తూ పందెం రాయుళ్లకు సకల సౌకర్యాలు కల్పించి రోజుకి వేలకు వేలు నిర్వాహకులు గడిస్తున్నారు. కృష్ణాపురం నుంచి భీమవరం వెళ్లే రహదారి వెంట ఉన్న మామిడి తోటలోని కోళ్లఫారం వద్ద అదేగ్రామానికి చెందిన ఒక వ్యక్తి స్థానికులతో కలిసి పేకాట ఆడిస్తున్నాడని, బదిపూడి గ్రామంలో కూడా ఇళ్లమధ్యనే పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సింగరాయకొండ, గుడ్లూరు, కందుకూరు మండలాలకు చెందిన పేకాటరాయుళ్లు ఈ గ్రామాలకు వచ్చి పేకాట ఆడుతుంటారు. చుట్టూ మామిడి తోటలు పైగా ప్రధాన రహదారిలో కాపలాదారులను పెట్టి పోలీ సులు, కొత్త వ్యక్తులు అటువైపు వస్తే వెంటనే ఫోన్‌ల ద్వారా నిర్వాహకులకు సమాచారం ఇస్తుంటారు. కాగా, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పర్యాటక కేంద్రంగా దుర్గం అభివృద్ధికి కృషి



దుర్గం అందాలను చూపుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి దుర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దుర్గం కొండల్లో పారే సెలయేళ్లు, దుమికే జలపాతాలు పర్యాటకలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. ఊటీని తలపిస్తున్న అందాలతోపాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అందులో భాగంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల దృష్టికి తీసుకువెళ్లి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు అందచేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా పార్టీలో చేరేందుకు మక్కువ చూపుతున్నారన్నారు. ఈనెల 30వ తేదీ వరకు సభ్యత్వ నమోదుకు గడువు ఉందని, కార్యకర్తలు లక్ష్యం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బాలసుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలు అందేనా.?

- కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

జలదంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ పరికరాలకు మోకాలొడ్డింది. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇబ్బడిముబ్బడిగా వ్యవసాయ పరికరాలు అందజేసింది. వైసీపీ పాలనలో దాని ఊసే ఎత్తకపోవడంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారు. ఈక్రమంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతంలో రూ.1 లక్ష విలువైన రోటోవేటర్ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం రాయితీపై రూ.10వేలకే ఇచ్చేవారు. ఇతర సామాజిక వర్గాల రైతులకు 50శాతం రాయతీపై ఇచ్చేవారు. రూ.30వేల విలువైన 5హెచ్‌పీ ఓపెన్‌వెల్ విద్యుత్ మోటారు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, ఇతర వర్గాలకు 50శాతం రాయితీపై ఇచ్చేవారు. ఇలా ఆయిల్ ఇంజన్లు, పవర్‌స్ప్రేయర్లు, ట్రాక్టర్ నాగళ్లు, కేజీ వీల్స్ స్ప్రేయర్లు, మినుము, పెసర నూర్పిడి యంత్రాలు తదితర 50కిపైగా రకాల యంత్రాలు మెకనైజెడ్ ఫార్మింగ్ పథకం కింద కేంద్రప్రభుత్వం అందించే రాయితీకి రాష్ట్రప్రభుత్వం మ్యాచింగ్‌గ్రాంట్ అనుసంధానించి గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అందించారు. ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలి.

117 జీవోతోపాటు ప్రభుత్వ యాప్‌లను రద్దు చేయాలి

- అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

కావలిటౌన్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష పూరితంగా ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయులపై భారం మోపిన యాప్‌లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కోఆపరేటివ్ కాలనీలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో జరిగిన అపస్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా జరగడంలేదని, పారదర్శంగా వ్యవహరించాలన్నారు. ఎస్‌జీటీలకు పదోన్నతలు కల్పించి జిల్లా పరిషత్ పాఠశాలలకు బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, వైసీపీ ప్రభుత్వంఉపాధ్యాయుల నగదు వేలకోట్లు దిగమింగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విధానంతోనే పెన్షన్లు ఇవ్వాలని, త్వరితగతిన డీఎస్సీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, గౌరవాధ్యక్షుడు రవికుమార్, మణికంఠచారి, మాల్యాద్రి, వెంకటరెడ్డి, రాధయ్య, సునీత, గూడల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో కూలిన గోడ



కావలిరూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కావలి పట్టణం వైకుంఠపురంలోని చేవూరివారి తోటలో ఆదివారం తెల్లవారుజామున కాసా వీరరాఘవులు ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఆమార్గంలో గోడ రాత్రి సమయంలో కూలడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మానవ మృగాన్ని శిక్షించాలి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బాలికపై పెట్రోలు పోసి తగులపెట్టిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని జిల్లా నూర్‌బాషా ముస్లిం (దూదేకుల) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం నాయకులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరు నగర అధ్యక్షుడు కే బాబర్‌ఖాన్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

గిరిజనులకు బియ్యం పంపిణీ

విడవలూరు, అక్టోబరు 20: మండల పరిధిలోని చౌకిచర్లలో చెరువు కట్ట కింద నివసిస్తున్న గిరిజనులకు గ్రామ మాజీ సర్పంచులు సమాది కృష్ణ వేణి, సమాది శ్రీనివాసులు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు సురేష్, విజయమ్మ, సుధీర్, అంకయ్య పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ విషయంలో ద్వంద్వ వైఖరి తగదు

- ఎస్‌ఎఫ్‌ఐ నేతల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కావలి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ విషయంలో ద్వంద వైఖరి అవలంబిస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘ నాయకులు ఆదివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్ పాఠశాలల వద్దకు తమ సంఘం వెళ్లి ప్రశ్నించగా వారు తమకు విద్యాశాఖాధికారులు నిర్వహించుకోమని చెప్పారని, మధ్యలో మీదేమిటని ఎదురు ప్రశ్రించారన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడగా వర్షాలు కారణంగా ఇటీవల పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున ఆదివారం అనుమతిచ్చామని చెప్పారన్నారు. ప్రయివేట్ పాఠశాలలపై ఉన్న అభిమానం ప్రభుత్వ పాఠశాలలపై అధికారులకు ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చొరవతీసుకుని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కావలి పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అభిలాష్, ఉదయకుమార్, ఉపాధ్యక్షుడు సాయి, నేతలు అనిల్, అరుణ్, నిక్కీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తూర్పు రాజగోపురం ద్వారబంధం ప్రతిష్ఠ

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మాణంలో ఉన్న తూర్పు రాజగోపురం ద్వారబంధం ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం జరుగనునట్లు నిర్మాణదాత ఎం.సుకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం చేస్తున్నామన్నారు. శాస్త్రోక్తంగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



టిడ్కో గృహ సముదాయంలో రోడ్లపై నీటిని పరిశీలిస్తున్న నేతలు

కావలిటౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయాన్ని సీ పీఎం నాయకులు ఆదివారం సందర్శించి నివాసితుల సమస్యలు తెలుసుకున్నారు. సీపీ ఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు టిడ్కో గృహాల్లో నీరు చేరి నివాసితుల ఇబ్బందులు పడ్డారని, రోడ్లలో మోకాలు లోతు నీరు చేరి కాలు కిందపెట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శివారు ప్రాంతం కావడంతో పాములు రోడ్లపై వస్తున్నాయని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని నివాసితులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి టిడ్కో గృహాల్లోని సమస్యలు పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, కృష్ణయ్య, తిరుపాలు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న దువ్వూరు కాలువ వంతెన రక్షణ గోడ

సంగంలోని దువ్వూరు కాలువ రెండవ వంతెన వద్ద ఒక వైపు రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెనకు ఉత్తరం వైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఈ వంతెన మీదగానే పాఠశాలకు వెళ్లాలి. రక్షణ గోడ శిథిలమై ప్రమాదకరంగా ఉండడంతో చిన్నారులను ఒంటరిగా వంతెన మీదుగా పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. -- సంగం (ఆంధ్రజ్యోతి)

ఏ క్షణంలో ఏం జరుగుతుందో...?



నెర్రెలు బారిన ఆలయ గాలిగోపురంపై కలశభాగం

ఉలవపాడులోని ప్రసిద్ధి గాంచిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం గాలి గోపురంపై ఉన్న కలశభాగం నెర్రెలుబారింది. సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం మీదుగా ప్రధాన రహదారి వెళుతుంది. నాలుగు అంతస్థుల ఎత్తున ఉన్న గాలిగోపురంపై రావిచెట్లు పెరగడంతో నెర్రెలు ఇచ్చింది. గోపురం కలశం విరిగిపడే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం పాదచారులు, వాహన దారులకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏక్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. - ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)

శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు!



అముదాలదిన్నెలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

మండలంలోని ఆముదాలదిన్నె, చౌదరిపాలెం గ్రామాల్లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ఇవి ఏక్షణమైనా కూలి పెనుప్రమాదం సభవించే అవకాశం ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆముదాలదిన్నె ఎస్టీకాలనీలో వాటర్ ట్యాంకు పైకప్పు కూలి అదే ట్యాంకులో పడిపోయింది. దీంతో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారి ఎప్పుడు కూలుతుందోనని సమీప ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చౌదరిపాలెంలో నివాసాల మధ్య ట్యాంకు పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి)

వేణుగోపాలుడి పవిత్రోత్సవాలు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో గల రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.



శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

ఈనెల 23వరకు ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజు ఉదయం శాంతిహోమం, మహాభిషేకం, అంకురార్పణ, విష్వక్సేన పూజ, పవిత్ర సమర్పణ జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ ఈవో జే శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

ముగిసిన 'పల్లెపండుగ'

● రూరల్ మండలంలో రూ. 2 కోట్ల పనులకు శంకుస్థాపనలు

నెల్లూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమం నెల్లూరు రూరల్లో ఆదివారంతో ముగిసింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. చివరి రోజు సౌత్‌మోపూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలతో గ్రామాలకు మహర్దశ పడుతోందని చెప్పారు. 'పల్లె పండుగ'లో భాగంగా గ్రామాల్లో ప్రారంభించిన పనులను త్వరతగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, వేదగిరి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ పోలయ్య, నాయకులు రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. గొల్లకందు కూరులోని జరిగిన 'పల్లె పండుగ'లో టీడీపీ నాయకులు పొణక హరిప్రసాద్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌మోపూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి, నాయకులు

'ఉపాధి' సామాజిక తనిఖీల ప్రారంభం

నెల్లూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలను నెల్లూరు రూరల్ మండలంలో ఆదివారం మొదలుపెట్టారు. పొట్టేపాళెం మినహా 17 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేసేందుకు సిబ్బంది గ్రామాలకు చేరారు. అక్కడక్కడ కొన్ని పనులను తొలి రోజు పరిశీలించారు. గ్రామ విస్తీర్ణాన్ని బట్టి తనిఖీ రోజులు పొడిగించిన డ్వామా అధికారులు, మొత్తంగా ఈ నెల 27వ తేదీతో గ్రామ సభలను పూర్తి చేసేలా షెడ్యూల్ విడుదల చేశారు. 'ఉపాధి'లో అవకతవకలు ఈ సామాజిక తనిఖీలతో బహిర్గతం కానున్నాయి.



పాతవెల్లంటిలో కాలువ కొలతలేస్తున్న తనిఖీ సిబ్బంది

అయోడిన్ ఎంతో అవసరం

నేడు ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినం

● మానవ ఎదుగుదలకు ముఖ్యమైన సూక్ష్మపోషకం
● లోపిస్తే ప్రాణాంతకమే
● జిల్లాలో 33 శాతం బాధితులు


నెల్లూరు (వైద్యం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారతీయ వంటకాలలో వాడే ఉప్పు ఉత్తమమైన అయోడిన్. అయోడైజ్ చేయని ఉప్పును ప్రభుత్వం కూడా నిషేధించింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అయోడిన్ మానవ దేహానికి ఎంతో ముఖ్యం. శరీరాన్ని నియంత్రించే థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని ఇది నియంత్రిస్తుంది. ప్రోటీను జీవక్రియకు ఎంతో ఉపయోగపడుతుంది. మెదడు ఎదుగుదలతోపాటు ఎముకలు పెరిగేందుకు దోహదపడుతుంది. ఫైబర్, ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాల సూక్ష్మపోషకాలను అయోడిన్ వర్గీకరిస్తుంది. అలాగే గుండె, జీవక్రియ, శరీర ఉష్ణోగ్రత , కండరాల సంకోచాలు వంటి శారీరక విధులను ఇది ఎంతో ప్రభావితం చేస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అయోడిన్ లోపం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

మానసిక, శారీరక వ్యాధులు

అయోడిన్ లోపం వల్ల మానసిక, శారీరక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయోడిన్ లోపిస్తే ఐరన్ లోపానికి గురవుతారు.

- అయోడిన్ పిల్లల పెరుగుదలకు ఎంతో ముఖ్యం. ఇది లోపిస్తే పుట్టుకతో వచ్చే వ్యాధులకు దారితీయవచ్చు.
- అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి తగ్గిస్తుంది. దీనివల్ల 90 శాతం గాయిటర్ కేసులు నమోదవుతున్నాయి.
- హైపో థైరాయిడిజం వ్యాధికి దారితీయవచ్చు. దీనివల్ల జీవక్రియ లోపిస్తుంది. శరీర ఉష్ణోగ్రతలు తగ్గి గుండె వ్యాధులు రావచ్చు.
- అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో ఎక్కువగా మానసిక వ్యాధులకు గురవుతారు. అలాగే వినికిడి లోపాన్ని కలిగిస్తుంది.
- దృష్టి లోపాన్ని కూడా కలిగిస్తుంది
- చిలగడదుంప, ఉల్లిపాయ, బచ్చలికూర, అరటిపండు వంటి వాటిలో అధికంగా అయోడిన్ ఉంటుంది.

జీవక్రియపై ప్రభావం



మూడొంతులు బాధితులే!

జిల్లాలో 33 శాతం మంది అయోడిన్ లోపంతో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎనిమిది ఏళ్ల కంటే తక్కువ ఉన్న పిల్లలకు రోజు కు 90 మిల్లీగ్రాములు, పెద్దలకు 150 మిల్లీగ్రాముల అయోడిన్ అవసరం ఉంటుంది. గర్భవతులకు 220 మిల్లీగ్రాములు, పాలిచ్చే తల్లులకు 290 మిల్లీగ్రాముల అవసరం ఉంటుంది. అయితే ఈ లెక్కల ప్రకారం అయోడిన్ అందకపోవటంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అయోడిన్ లోపంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్దేశించింది.

అయోడిన్ లోపిస్తే తీవ్ర అనారోగ్యం



అయోడిన్ లోపిస్తే శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. థైరాయిడ్ హార్మోన్‌కు ఇది ఎంతో ఉపయోగం. అయోడిన్ లోపించటం వల్ల పిలల ఎదుగుదలలో ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే ప్రభుత్వం కూడా ఉప్పులో అయోడిన్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన పెట్టింది. దేశవ్యాప్తంగా అయోడిన్ సమస్య తీవ్రంగా ఉంది.

- డాక్టర్ నరేంద్ర, ఫిజీషియన్, జీజీహెచ్

300 మంది రక్తదానం అద్భుతం

మనుబోలు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 300 మంది యువకులు రక్తదానం చేయడం అద్భుతమని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని మనుబోలు ఎస్‌ఐ శివరాకేష్ ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సహకారంతో స్థానిక సీఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి యువకులు, రాజకీయ నాయకులు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ ఎస్‌ఐను శాలువాతో సన్మానించారు. పొదలకూరు సీఐ రాంబాబు, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ అజయ్‌బాబు, వైద్యులు రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మధునాయుడు, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, టి. వెంకరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● హెచ్‌ఎంలు, ఎంఈవోల సంఘం విజ్ఞప్తి

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో దీర్ఘకాలంగా నెలకొని ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కోరారు. నగరంలోని సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఎంఈవోల సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ భాస్కర రెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి పాఠశాల గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా ఉందన్నారు. ఎంఆర్‌సీ గ్రాంట్ కూడా నిలుపుదల చేయడంతో సమావేశాలు, సమీక్షలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పాఠశాలల నిర్వహణ భారం తగ్గించాలని కోరారు. జీవో నెంబరు 117 రద్దు నిర్ణయం శుభ పరిణామమన్నారు. ఎంఈవో-2 జాబ్ చార్ట్‌ను సవరించడంతోపాటు అనవసరమైన యాప్‌ల నుంచి తమకు విముక్తి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు ఎంవీ చలపతి, కోశాధికారి చలపతి, నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్, కార్యదర్శి సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో నేడు విగ్రహ ప్రతిష్ఠ

హాజరుకానున్న మంత్రులు ఆనం, నారాయణ

మనుబోలు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బద్దెవోలులో సోమవారం కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరుకానున్నారని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య తెలిపారు. శనివారం నుంచి ఆలయంలో ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నూతన శిలా విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు, ధ్వజస్తంభానికి అధివాసాలు జరిగాయి. భక్తులతో అభిషేకాలు చేయించారు. నూతనపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేదోక్తంగా పూజలు, హోమాలు జరిగాయి. పలువురు దంపతులు దీక్షావస్త్రాలు ధరించి, రక్షాబంధనాలతో పూజలు చేశారు.



ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు తీసుకెళ్లాలి

● కార్యకర్తలతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం కనుపర్తిపాడు వద్దనున్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కోవూరు నియోజకవర్గ పార్టీ సభ్యత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం రుచి చూపించిన పార్టీ దేశంలో టీడీపీ ఒక్కటేనన్నారు. సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని తెలిపారు. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న పార్టీ సభ్యత్వ నమోదులో కోవూరు అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు. రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం పొందవచ్చని, రూ.100 చెల్లించి తీసుకునే సభ్యత్వం రెండేళ్లపాటు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యత్వ పరిశీలకుడు కార్తీక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



మిక్కిలింపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కొడవలూరు(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని మిక్కిలింపేటలో ఆదివారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.5లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మిక్కిలింపేటకు గత ప్రభుత్వంలో మంజూరైన సుమారు రూ.కోటి నిధులను పక్కదారి పట్టించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారావు, సర్పంచు కోడూరు బుజ్జిరెడ్డి, నాయకులు ముంగమూరి శ్రీహరిరెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జీవీఎన్ శేఖర్‌రెడ్డి, కోడూరు సుధాకర్‌రెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందితో కార్తీక దీపోత్సవం

● సింహపురి కార్తీక దీపోత్సవ సమితి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్వర్ణాల చెరువు తీరాన గణేష్ ఘాట్ వద్ద నవంబరు 15న జరిగే కార్తీక మహా దీపోత్సవాన్ని లక్ష మంది మహిళలతో నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి పిలుపునిచ్చింది. నగరంలోని రామమూర్తినగర్‌లో గల ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఆ సమితి సమావేశం, దీపోత్సవం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ కే వెన్నెల మాట్లాడుతూ సింహపురి మహిళల ఆధ్యాత్మిక చైతన్యానికి స్ఫూర్తిగా జరిగే ఈ మహా దీపోత్సవానికి లక్ష మంది మహిళలు తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కమిటీ ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజు ఉదయం విశాఖపట్నం శ్రీరామానంద భారతీ స్వామీజీ ఆధ్వర్యంలో గోపూజ జరుగుతుందని తెలిపారు. రామలింగేశ్వ రస్వామికి విశేష అభిషేకాలు, శివపార్వతులు, భూదేవి సమేత వరాహ స్వామి, వేంకటేశ్వర కల్యాణోత్సవాలు ఏకకాలంలో ఒకే వేదికపై జరుగుతాయని వివరించారు. తిరుపతి శక్తిపీఠం రమ్యానంద భారతీ, అవధాని బులుసు అపర్ణ ప్రవచనం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, ఉమాదేవి, లక్ష్మీ కామాక్షి, జయలక్ష్మి, సురేఖ, వ్యాసప్రసాద్, నరేంద్ర, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహాదీపోత్సవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ● నగర మహాసభల ప్రారంభం



అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆ పార్టీ 25వ నగర మహాసభలు నెల్లూరులోని బాలాజీనగర్ వీజీబీ కల్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అమరవీరుల చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు రోజులు జరిగే ఈ మహాసభలలో తొలిరోజు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ రాబోయే రోజులలో చేపట్టనున్న ప్రజా ఉద్యమాల గురించి తెలియచేశారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై ప్రభుత్వం భారం వేయాలని చూస్తోందని, మద్యం ఏరులై పారేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆరోపించారు. జమిలీ ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. డిసెంబరు 7,8 తేదీలలో ఇందుకూరుపేటలో జిల్లా స్థాయి సమావేశాలు, ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఎందరో కమ్యూనిస్టు యోధుల కారణంగా సీపీఎం బలపడిందన్నారు. దీన్ని కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాలువగట్లపై నివసిస్తున్న పేదలకు, పొదుపు మహిళలకు అండగా నిలవాలని, ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని, వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ఆపాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, షేక్ మస్తాన్‌బీ, అత్తిమూరు శ్రీనివాసులు, నాగేశ్వరరావ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి నేడు దరఖాస్తుల స్వీకరణ

తోటపల్లిగూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సంస్థ కాంపోసిట్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం 10గంటలకు దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి కోవి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు అర్హులైన వారికి మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, ఉపకరణాలు కొరకు ఎంపిక జరుగుతుందని తెలిపారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు తీసుకుని రావాలని పేర్కొన్నారు. వృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, 2ఫొటోలు తీసుకొనిరావాలని కోరారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

కోవూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ సమీపంలో ఆదివారం జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్ఆర్, ఎస్ఎస్ఆర్, ఎన్‌పీకేఆర్ కాలనీల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో 70 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు బొమ్మన విజయకుమార్, దండూరి కామేశ్వరరావు, ఏకుల లక్ష్మయ్య, తలపల చెంచయ్య, తదితరులు మాట్లాడారు.

గిరిజనులకు బియ్యం పంపిణీ

విడవలూరు, అక్టోబరు 20: మండల పరిధిలోని చౌకిచర్లలో చెరువు కట్ట కింద నివసిస్తున్న గిరిజనులకు గ్రామ మాజీ సర్పంచులు సమాది కృష్ణ వేణి, సమాది శ్రీనివాసులు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడుతున్న పేదలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచన మేరకు తమ వంతు సహాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు సురేష్, విజయమ్మ, సుధీర్, అంకయ్య, జనసేన నాయకుడు మల్లికార్జున పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఇసుక తరలింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతాలైన మినగల్లు, బాపనపాడు, జొన్నవాడ గ్రామాల సమీపంలోని ఇసుక రీచ్‌ల్లో ఆదివారం ఇసుక రవాణా పండుగ వాతావరణాన్ని తలపించింది. గతంలో రూ.5 వేలు ఉన్న ట్రాక్టర్ ఇసుక ప్రస్తుతం రూ.2,500 నుంచి రూ.3వేలకు తగ్గించారు. దీంతో పలువురు భవనాల యజమానులు ఇసుక తోలించుకుంటున్నారు. అయితే ఆదివారం సెలవు దినం కావడంతో ఇసుక రవాణా విచ్చలవిడిగా సాగిస్తుండడంపై కొంతమంది సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా ప్రయోజనంలేకపోయిందని తెలిసింది.

ఈవోపీఆర్‌డీ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు ఈఓపీఆర్‌డీగా దేవరాల బాలకృష్ణయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దొరబాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇనుకుర్తి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దేవరాల బాలకృష్ణను నియమిస్తూ ఎంపీడీవో డీవీ నరసింహారావు ఉత్తర్వులు ఇచ్చా రు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టి మా ట్లాడుతూ మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు.

మానవ మృగాన్ని శిక్షించాలి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బాలికపై స్నేహం ముసుగులో పెట్రోలు పోసి తగులపెట్టిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని జిల్లా నూర్‌బాషా ముస్లిం (దూదేకుల) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం నాయకులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కడప జిల్లా బద్వేల్ మండలం గోపవరంలో ఈ దుర్ఘటన జరిగిందన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరు నగర అధ్యక్షుడు కే బాబర్‌ఖాన్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుళ్లు బాధాకరం

మనుబోలు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో గతనెల 15న గణేష్ ఉత్సవాల్లో బాణాసంచా పేలుళ్లు జరగడం బాధాకరమని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశానికి పక్కనే ఉన్న మంగమ్మ ఇల్లు చాలా దెబ్బతింది. దీంతో ఎస్‌ఐ శివరాకేష్ తన సొంత నిధులు రూ.15వేలు ఖర్చు చేసి ఆ ఇంటిని బాగు చేయించారు. దీనిని డీఎస్పీ పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు. మంగమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్‌ఐ శివరాకేష్, టీడీపీ నాయకులు చెల్లగిరి ప్రసాద్, రాజాగౌడ్, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, మధునాయుడు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం

పొదలకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిర్మలానంద యోగా సెంటర్‌లో పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ప్రముఖ యోగా గురువు రిత్‌దేవ్‌జీ మహరాజ్ పాల్గొని షుగర్ వ్యాధితో బాధపడే వారు యోగా సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సీహెచ్ పెంచలయ్య, లక్కాకుల ఆనంద్ పాల్గొన్నారు.



● తిరుపతికి చెందిన ఓ యువతి గర్భం దాల్చింది. దాన్ని పోగొట్టుకునేందుకు మందుల కోసం తిరుపతిలోని ప్రైవేటు దుకాణాన్ని ఆశ్రయించింది. డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇవ్వాలంటే అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారుడు చెప్పాడు. గత్యంతరం లేక ఎమ్మార్పీ కంటే రెండింతల ధర పెట్టి మందులు కొనుగోలు చేసింది. వాటిని ఇష్టానుసారం వాడటం వల్ల తీవ్ర రక్తస్రావమై ప్రాణం మీదకు తెచ్చుకుని ఆస్పత్రి పాలైంది.



● శ్రీకాళహస్తికి చెందిన సురేష్ తన ఐదేళ్ల కుమారుడు దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఓ మందుల దుకాణానికి వెళ్లి విషయం చెప్పాడు. దుకాణ యజమాని మందులు ఇచ్చి, మూడు రోజులు వాడమని చెప్పాడు. ఆ మందులు వాడినా ఎలాంటి ఉపయోగమూ లేకపోగా బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించింది. చివరకు డాక్టరు దగ్గరకు వెళ్లారు. బాలుడిని రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నా సంబంధిత వైద్యాధికారులు కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,700 లైసెన్సు కలిగిన మందుల దుకాణాలు ఉంటే అందులో తిరుపతిలో 600లకు పైగా ఉన్నాయి. లైసెన్సు లేకుండా 500కు పైగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సగటున రోజుకు రూ.6 నుంచి 8 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అర్హత లేకనే మందుల (ఔషధ) దుకాణాలు పెట్టేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యుల సిఫారసు లేకుండా ఇస్తున్న మందులతో రోగుల ప్రాణాల మీదకు వస్తోంది.

నిబంధనలు గాలికి..!

- పుట్టగొడుగుల్లా అనధికారిక మందుల దుకాణాలు
- డాక్టర్ల చీటీలు లేకుండానే విక్రయాలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- మామూళ్ల మత్తులో వైద్యాధికారులు

తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి

నిబంధనలు ఇలా..

- మందుల దుకాణం ప్రారంభించాలంటే ముందుగా ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి తీసుకోవాలి.
- దుకాణంలో డీఫార్మసీ పూర్తి చేసిన ఫార్మాసిస్టు తప్పక అందుబాటులో ఉండాలి. అనుమతి వారి పేరుతోనే ఉండాలి.
- మందుల విక్రయాలు పూర్తిగా డాక్టరు చీటి ఉంటేనే విక్రయించాలి. కొనుగోలు చేసిన, విక్రయించిన మందుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి.

అమలు చేసేవారేరి?

- మందుల విక్రయదారులకు తప్పక బిల్లు చెల్లించాలి. కానీ జిల్లాలో ఎక్కడా జరగడం లేదు.
- ఇరుకు గదుల్లోనూ దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.
- ఫార్మసీ చదివిన వారు లేకనే మందుల దుకాణాలు కొనసాగుతున్నాయి. అవగాహన లేకనే మందులు ఇచ్చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
- ఔషధ దుకాణాలకు ఐదేళ్లకొకసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా పాటించడంలేదు.

పత్తాలేని అధికారులు..

జిల్లాలో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు ఒకరు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఉన్నారు. వీరు మందుల దుకాణం ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో కొలతలు, నిబంధనలు పరిశీలించాలి. నెలలో ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలి. ఆ దిశగా ఎక్కడా కనిపించడం లేదు. ముడుపులు అందుతుండడం వల్లే అటువైపు చూడడం లేదన్న విమర్శలున్నాయి. దుకాణాలు పక్క ప్రాంతాల్లోకి మార్చుకోవాలన్నా లేదా ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నా అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. ఇదే వ్యవహారంలో ఇటీవల గూడూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు.



కొల్లడంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

శ్రీసిటీ గ్రామాల్లో సర్వే కలకలం

సత్యవేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండల పరిధిలోని శ్రీసిటీ గ్రామాల్లో రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూముల సర్వే కలకలం రేగుతోంది. శ్రీసిటీ పరిధిలోని కొల్లడం, ఇరుగుళం పంచాయతీలలో తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 15 మంది సర్వేయర్లు, వీఆర్వోల బృందం పోలీసు బందోబస్తు మధ్య గ్రామాల్లోని భూముల్లో అణువణువు సర్వే చేపట్టారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తాము సాగు చేసుకుంటున్న భూముల్లో సర్వే ఎందుకు చేస్తున్నారంటూ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ భూములనే నమ్ముకుని పంటలు పండించుకుని జీవనం గడుపుతున్న తమ భూములను శ్రీసిటీకి కట్టబెట్టేందుకే రెవెన్యూ అధికారులు ఉన్నపళంగా సర్వేలు చేపడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాగా 2008లో శ్రీసిటీ ఏర్పాటు కోసం మొదటి దశలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఏపీఐఐసీ రైతుల ద్వారా సేకరించింది. ఇందులో కొల్లడం, ఇరుగుళం గ్రామాలలో కొంతమంది రైతులు భూములను ఏపీఐఐసీకి ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈ గ్రామాల్లో అధికారుల బృందం సర్వే చేయడం చర్చనీయాశంగా మారింది. ఈ విషయమై తహసీల్దార్ సుబ్రమణ్యంను వివరణ కోరగా.. కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న భూములకు, రికార్డుల్లో ఉన్న భూములకు వ్యత్యాసాలు ఉన్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు తాము సర్వేలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



అధికారులతో రైతుల వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

ప్రశాంత వాతావరణంతోనే అభివృద్ధి సాధ్యం

- నేటి నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

తిరుపతి(నేరవిభాగం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రశాంత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం నుంచి 11 రోజులపాటు పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దులు మొదలుకుని.. అంతర్గత భద్రత వరకు పోలీసుల పాత్ర కీలకమన్నారు. అలా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ధైర్య సాహసాలను, త్యాగనిరతిని స్మరించుకోవడానికి సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, వారి కుటుంబీకులను సన్మానిస్తామన్నారు. వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు.. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. 11 రోజుల పాటు అన్ని సబ్ డివిజన్లు, సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్లలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ఎస్బీ డీఎస్పీ గిరిధర్ పాల్గొన్నారు.

రెండు రోజులు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుంచి రెండు రోజుల పాటు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోరాట వాహనాలు, బాంబు డిస్పోజల్ ఎక్విప్‌మెంట్లు తదితరాలపై పోలీసు పరేడ్ మైదానంలో ప్రదర్శన ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

వైసీపీ నేత ఇంటిపై దాడికి యత్నం!

- అడ్డుకున్న కార్యకర్తలు
- మూడు గంటల పాటు కారులో టీడీపీ నాయకుడి నిర్బంధం
- అర్ధరాత్రి వరకు చిల్లకూరులో ఉద్రిక్తత
- నాటి వైసీపీలో గ్రూపు గొడవలే కారణమా?



కారుకు అడ్డుగా కుర్చున్న వైసీపీ కార్యకర్తలు


పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరులోని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్, వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటిపై దాడికి యత్నించారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు టీడీపీ నేతలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వీరు గతంలో వైసీపీలో ఉండి.. ప్రస్తుతం టీడీపీలో చేరిన వారు కావడం గమనార్హం. నాడు వైసీపీలోని గ్రూపు విభేదాలే.. ఇప్పుడూ కొనసాగుతూ ఈ సంఘటనకు కారణమైందని సమాచారం. వివరాలిలా ఉన్నాయి. సొంత పనులపై ఆదివారం సత్యనారాయణరెడ్డి బయటకు వెళ్లారు. సాయంత్రం 7 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన గతంలో వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలో చేరిన దువ్వూరు రాకేష్‌రెడ్డి, దయాకర్‌తో పాటు టీడీపీకి చెందిన శిరసనంబేడు గ్రామస్థుడు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, పునబాకకు చెందిన లోకేష్‌నాయుడు కలిసి సత్యనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్నారు. వీరిలో రాకేష్‌రెడ్డి, దయాకర్.. కామిరెడ్డి ఇంటిపై దాడికి యత్నించినట్లు గ్రామస్థులు ఆరోపించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సత్యనారాయణరెడ్డి సతీమణి ప్రభావతమ్మ కేకలు వేయడంలో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంటి గేట్లకు తాళాలు వేసి కారులో వెళ్లేందుకు చైతన్యకృష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డి, లోకేష్‌నాయుడు ప్రయత్నించగా, గ్రామస్థులతో పాటు వైసీపీ కార్యకర్తలు కారును చుట్టుముట్టారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, అర్బన్ సీఐ బాబీ, ఎస్ఐ శ్రీహరి, ఓజిలి ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది చిల్లకూరు చేరుకున్నారు. కారును చుట్టుముట్టిన గ్రామస్థులను, వైసీపీ కార్యకర్తలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయినా, గ్రామస్థులు లేవకపోవడంతో పోలీసులు.. కారులో ఉన్న రాకేష్, లోకేషను చాకచక్యంగా తప్పించి పోలీస్ వ్యాన్‌లో తీసుకెళ్లారు. దీంతో వైసీపీ కార్యకర్తలు ఆగ్రహించి.. బయట ఊరినుంచి ఇక్కడ గొడవలు పెడుతున్నారని చైతన్యకృష్ణారెడ్డిని తీసుకెళ్లకుండా అడ్డుపడ్డారు. ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, ఎడ్లబండ్లను కారుకు అడ్డుపెట్టి మూడు గంటల పాటు చైతన్యకృష్ణారెడ్డిని నిర్బంధించారు.ఎట్టకేలకు పోలీసులు ఆయన్ను రాత్రి 11.30 గంటలకు కారులో తరలించారు. దీంతో గ్రామంలో ఏం జరుగుతుందోనన్న ఉద్రిక్తత నెలకొంది. గతంలో వైసీపీలో గ్రూపు గొడవలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.



నచ్చజెబుతున్న పోలీసులు

విద్యారంగ ఉద్యమాల్లో ఏఐఎస్ఎఫ్‌ది కీలక పాత్ర

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటాలు చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై సంఘం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమ దశలో జరిగిన అరెస్టులు, లాఠీచార్జీలు, జైలు శిక్షలను ప్రస్తావించారు. నాయకులు గతాన్ని మరువకుండా సామాజిక సేవలోనూ పాల్గొనాలని కోరారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరిగే 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జి.ఈశ్వరయ్య, ఎ.రామానాయుడు, బి.లక్ష్మయ్య, ఎస్.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, కోట పురుషోత్తం, మంజునాథ్, విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, డాక్టర్ కాటమరాజు, నాగరాణి, డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఇన్‌చార్జుల పాలనలో రేణిగుంట ఎస్ఆర్వో

- కీలక స్థానంపై అధికారుల నిర్లక్ష్యం
- నిత్యం రూ.కోట్ల విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్

తిరుపతి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చాలాకాలంగా ఇన్‌చార్జుల పాలనే కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇదే కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న శోభారాణిపై నిధుల దుర్వినియోగం, విధుల్లో అలసత్వం కారణంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేటుపడింది. అప్పట్నుంచి నాలుగు నెలలుగా అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రవ్యాప్త బదిలీల్లోనూ రేణిగుంటకు సబ్ రిజిస్ట్రార్‌ను నియమించలేదు. ఉద్దేశ పూర్వకంగానే ఈ పోస్టును భర్తీ చేయకుండా వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసి సస్పెండైన ఓ అవినీతి అధికారి రేణిగుంటకు ఎవరినీ రానీయకుండా తెరవెనుక తతంగం నడిపినట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి పెద్దయెత్తున చేతులు మారినట్లు కార్యాలయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పని ఒత్తిడి కారణంగా అవసరమైతే మరో జాయింట్ రిజిస్ట్రార్‌ను కూడా రేణిగుంటకు తీసుకోమని నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉన్నతాధికారులను మభ్యపెట్టి తనకు అనుకూలమైన సీనియర్ అసిస్టెంట్‌ను తాజా బదిలీల్లో రేణిగుంటకు పోస్టింగ్ వేయించడం కూడా అవినీతి అధికారి పథకంలో ఓ భాగమేనన్న అనుమానాలున్నాయి. రోజూ సుమారు రూ.15 కోట్ల విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగే కీలక స్థానమైన రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. విస్తృత పరిధి కలిగిన ఈ కార్యాలయానికి ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లను నియమించాల్సిన అవసరముంది.

బాలిక దొరికింది

- 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి పరారైన 14 సంవత్సరాల బాలిక ఎట్టకేలకు ఆదోని సమీపంలో పట్టుబడింది. ఆమెను ఆదివారం బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. మారుతీనగర్‌లోని ఈమె నాలుగో తరగతి వరకు చదివి.. ఇంటి వద్దే ఉంటోంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఇంటికి వచ్చిన తండ్రి తన కుమార్తె కనిపించకపోవడంతో ఈస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పరారైన బాలిక ఆచూకీ కనుక్కోవడానికి డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐ శ్రీనివాసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బాలిక ర్యాపిడో బుక్ చేసుకుని రైల్వే స్టేషన్‌కు వెళ్ళినట్లు గుర్తించిన సీఐ.. ఏ సమయానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లిందనేది తెలుసుకున్నారు. ఆ ప్రకార రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళినట్లు గుర్తించారు. బాలిక ఫొటో ఆధారంగా ఆదోనిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బసవరాజు, తన స్నేహితుడు భైరెడ్డి ద్వారా సీఐ రైలులో గాలింపు చర్యలు చేపట్టారు. ఆ బాలిక హైదరాబాదు వెళుతున్నట్లు తెలుసుకుని అన్ని బోగీలు వెదికారు. ఈ క్రమంలో అమ్మాయి ఆచూకీ గుర్తించి ఆదోనికి శివారులో గుర్తించి బాలికను పట్టుకుని విచారించారు. హైదరాబాదులోని ప్రధాన చర్చిలో ప్రార్థనలు చేయడానికి వెళుతున్నానని చెప్పడంతో బాలికను మెల్లగా కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు తీసుకొచ్చి అక్కడ రైల్వే పోలీసుల సాయంతో గుత్తికి తీసుకొచ్చారు. అనంతరం తిరుపతి నుంచి కానిస్టేబుళ్ళను పంపి ఆదివారం సాయంత్రం ఇక్కడికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. పరారైన 24 గంటల్లోనే బాలికను తల్లి దండ్రులకు అప్పగించడం పట్ల ఎస్పీ అభినందించారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం మీకోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదికను(పీజీఆర్ఎస్) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. డివిజన్, మండల, సచివాలయ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు.



పచ్చగా.. కనువిందుగా..

ఇలా పచ్చని మొక్కలతో.. కనువిందుగా ఉన్న ఈ డివైడరు ఉండేది తిరుపతి నగరం చింతలచేనుకు తూర్పుగా ఏర్పాటుచేసిన కులశేఖర్ ఆళ్వార్‌రోడ్డులో. రోడ్డు మధ్యలో దాదాపు 10అడుగుల వెడల్పుతో సువాసన ఇచ్చే పలు రకాల పుష్పాలు, పత్రాల మొక్కలను నాటారు. ఈ దారిలో రాకపోకలు సాగించే వారితో పాటు.. అటు పక్కన వెళ్లే రైలులోని ప్రయాణికులనూ ఆకట్టుకుంటున్నాయి. ఇటుగా వెళ్లే వారు డివైడరు వద్ద ఫొటోలు దిగుతున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఇలా నెట్టుకొచ్చారు



కదిలితేనే బండి. లేదంటే మొండి. ఇలా మొరాయించిన ట్రాక్టరును ఆదివారం ఉదయం తిరుపతిలో తాపీ కూలీలు తోసుకుంటూ వెళ్లారు. భవనస్లాబ్ కోసం మిక్సర్, ఇతర పరికాలతో పాటు కూలీలు కరకంబాడి రోడ్డు సమీపం నుంచి ట్రాక్టర్, ట్రాలీతో బయలుదేరారు. లీలామహల్ సమీపానికి చేరుకోగా ట్రాక్టర్ ఆగిపోయింది. ఎంతకీ స్టార్టు కాకపోవడంతో మెకానిక్ షెడ్డు వరకు ఇలా తోసుకుంటూ వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సోది చెబుతానమ్మా..



బుర్రలు చేతపట్టి 'సోదమ్మో సోది' అంటూ తీర ప్రాంత పల్లెల్లో తిరిగేవారు ఇటీవల పెరిగారు. వీరిపై నమ్మకంతో కొందరు మహిళలు సోది చెప్పించుకుంటున్నారు. గతంలో 'సోది' చెప్పే బుర్రక్కలకు ఆదరణ ఉండేది. ఇదే జీవనాధారంగా ఎన్నో కుటుంబాలు బతికాయి. మారుతున్న కాలాన్ని బట్టి సోది మాటే లేకుండా పోయింది. అయితే, దసరా నుంచి కోట, వాకాడు, చిట్టమూరు తదితర సముద్రతీర మండలాల్లో సోది బుర్రక్కల సందడి ఉంటోంది.

- కోట, ఆంధ్రజ్యోతి



సందర్శకులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన కాటేజీ



గెస్ట్ హౌస్‌ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్‌లు



డార్మెటరీలో ఏర్పాటు చేసిన పడకలు

చుట్టూ ఎత్తయిన చెట్లు. స్వచ్ఛమైన గాలి. పక్షుల కిలకిలరావాలు. వీటి నడుమ ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకుంటున్నారా? ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాసింత ఆహ్లాదానుభూతులను పొందాలనుకుంటున్నారా? అయితే, మామండూరు వెళ్లాల్సిందే.

- మంగళం, ఆంధ్రజ్యోతి

రారండోయ్.. మామండూరు

- మానసికోల్లాసానికి 'వాటర్ ఫ్లో'

ఎలా వెళ్లాలంటే..

కడప వెళ్లే దారిలో తిరుపతికి 22 కి.మీ. దూరంలో మామండూరు ఉంది. బస్సు లేదా సొంత వాహనాల్లో ఇక్కడకు చేరుకోవచ్చు. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు లోపలకు వెళితే గెస్ట్‌హౌస్ ఉంటుంది. ఇక్కడకు మాత్రం బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో వెళ్లేవారు కార్లు, జీపులకు రూ.20, ఆటోకు రూ.15, ద్విచక్ర వాహనానికి రూ.10 చెల్లించాలి. గెస్ట్‌హౌస్ నుంచి కిలోమీటరు దూరంలో ముచ్చటగొలిపే నీటి ప్రవాహం (వాటర్ ఫ్లో) ఉంది.



గుంట మడుగు వద్ద వాచ్ టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

ఎంచక్కా బస చేయవచ్చు

ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి సాయంత్రం వరకూ ప్రకృతి అందాలను చూడవచ్చు. కటక్, గుంజర, తుంబుర, హరిణి, మయూరి పేర్లతో కాటేజీలున్నాయి. రోజుకు రూ.3వేలు చెల్లించాలి. రెండు బెడ్లు ఉంటాయి. డార్మెటరీకి రూ.6వేలు చెల్లించాలి. ఇందులో 10 బెడ్లు ఉంటాయి. 'వనదర్శిని' వెబ్‌సైట్ ద్వారా గదులు బుక్ చేసుకోవచ్చు. బస చేసేవారు ఆహారాన్ని తీసుకెళ్లవచ్చు. లేదనుకుంటే వండి సరఫరా చేసేందుకు ఓ క్యాంటీన్ ఉంది. ముందుగా ఆర్డర్ ఇస్తే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం తయారు చేస్తారు.

ఎప్పుడు అనుకూలం

తిరుమల కొండల్లోని పాపవినాశనం, గోగర్భం డ్యాం నిండాక నీరు ఇక్కడకు చేరుకుంటుంది. వర్షాల సమయంతో జలపాతాలు కనువిందుచేస్తాయి. నడుము లోతు వరకు వచ్చే ఈ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఈత కొడుతూ మైమరచిపోతారు. ప్రమాదం లేకుండా జలకాలాడటానికి ఇక్కడి వాతావరణం అనుకూలం. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు నీటి ప్రవాహం ఉంటుంది. రోజూ దాదాపు 1,500మంది, అన్‌సీజన్‌లో 400మంది వస్తుంటారు. పిల్లలు ఆడుకోడానికి కొన్ని సౌకర్యాలున్నాయి.



మామండూరు వద్ద వాటర్ ఫ్లో

త్వరలో జంగిల్ సఫారి



సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచడానికి త్వరలో జంగిల్ సఫారీ ప్రారంభించబోతున్నాం. గెస్ట్ హౌస్ నుంచి అటవీ ప్రాంతంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాల్లో వెళ్లి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రోడ్డు వేశారు. జంగిల్ సఫారీలో అందమైన అటవీప్రాంతాన్ని వీక్షించవచ్చు.

- గౌస్ కరీం, డీఆర్వో

రైతు మోమున లాభాల గుబాళింపు

- పూలసాగుపై పెరుగుతున్న ఆసక్తి
- పండగలొస్తే మరింత లాభసాటి
- వర్షాలకు అడపాదడపా నష్టం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి: ఎర్రావారిపాలెం మండలంలోని రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల దసరా సందర్భంలో మంచి గిట్టు బాటు ధర లభించడంతో వీరిలో ఆనందం వ్యక్తమవుతోంది. సుమారు రెండునెలల్లోనే చేతికందడంతో ఎక్కువమంది బంతి పూలసాగు వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతం కిలో బంతిపూల ధర రూ.40కి తక్కువ లేకుండా పలుకుతోంది. పండుగ సందర్భాల్లో ధర మరింత పెరిగి లాభసాటిగా మారుతోంది. బంతితోపాటు ఇతర పూల పంటలనూ సాగుచేస్తున్నారు. రోజాలు కిలో రూ.160, సెంటు మల్లెలు రూ.200 చొప్పున ధర పలుకుతున్నాయి. మండలంలోని పెద్దనాయనపల్లె, బడగన పల్లె,ఎల్లమంద, ఉస్తికాయల పెంట గ్రామాల్లో రైతులు బంతి సాగు చేస్తున్నారు. భాకరాపేట-తలకోన రోడ్డు పక్కనే పెద్దనాయనిపల్లె వద్ద సాగు చేసిన పూలతోటలకు మంచి డిమాండు ఉంది. రోడ్డు పక్కనే ఉండడంతో తోటలోని పూలు కోసి వెంటనే ఇస్తుండటంతో చాలామంది ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. దీంతో దళారుల బెడద, కమీషన్ లాంటివి లేకుండా వెంటనే చేతికి డబ్బు అందుతోందని చెప్పారు. వ్యాపారులకు పూలను సరఫరా చేస్తే కమీషన్, తోపుడు రిస్కు(అదనంగా పూలు) ఉంటాయంటున్నారు. డబ్బులు సరిగా చెల్లించకపోవడంతో అడపాదడపా నష్టపోతున్నామంటున్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంలోనూ మంచి ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. వర్షాలొస్తే పూల రేకుల్లో నీరు చేరితే కుళ్లిపోయినా, నానినా నాణ్యత తగ్గుతుంది. ఇలాంటప్పుడు తక్కువ ధరకు అమ్మి వీరు నష్టపోతున్నారు. వర్షాకాలంలో చీడ పీడలు, తేమ శాతం ప్రతికూలంగా పరిణమిస్తున్నాయి. ఉద్యాన అధికారులు అధిక దిగుబడినిచ్చే విత్తన మొలకలు సరఫరా చేస్తే నాణ్యమైన పూలతోటలను సాగు చేసి మరిన్ని లాభాలు ఆర్జిస్తామని రైతులు చెబుతున్నారు.





అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్యాలయ వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు హర్షదా, అనూష, అక్షర, సహనా, రోషికా, దీప్తి, సంగీత, ధాన్వియ, ప్రగతి, బవదర్శిని తదితరులు శివ శ్లోకం, శ్రీరామచంద్రుడు, స్వాగతం కృష్ణా సుస్వాగతం కృష్ణా, కన్నన్ వరుగింద్ర నీరం, అదిదానో రంగా, తోడై మంగళం, హరే రామ రామ గోవింద హరే వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వారిని ఆదివారం తెలంగాణ, మద్రాసు హైకోర్టుల న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ సుధీర్ కుమార్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ రాజేశ్వరరావు



జస్టిస్ సుధీర్‌కుమార్

శ్రీవారికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చాం

తిరుమల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గోపిచంద్ 'విశ్వం' సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన క్రమంలో వేంకటేశ్వరస్వామిని కృతజ్ఞతలు తెలుపుకునేందుకు వచ్చామని ఆ చిత్ర దర్శకుడు శ్రీను వైట్ల తెలిపారు. నిర్మాత వేణుదోనేపూడి, నటుడు శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీను వైట్ల ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. స్వామికి ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు. విశ్వం చిత్రాన్ని హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలన్నారు. 'దేవర' సినిమాలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని నటుడు శ్రీకాంత్ తెలిపారు. కొన్ని కారణాల వల్ల గోపిచంద్ దర్శనానికి రాలేకపోయారని, ఆయన బదులుగా తాను ఉన్నట్టు అందరు భావించాలన్నారు. తాను నటించిన గేమ్‌చేంజర్ సంక్రాంతికి విడుదల కానుందన్నారు. కల్యాణ్‌రామ్, సాయిధరమ్ తేజ్‌తో నటించిన చిత్రాలు కూడా త్వరలో విడుదల కానున్నాయన్నారు. వీటి తర్వాత తాను హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు. తన కుమారుడు రోషన్ 'ఛాంపియన్' అనే సినిమా షూటింగ్‌లో బీజీగా ఉన్నాడని ఓప్రశ్నకు బదులిచ్చారు.



ఆలయం ఎదుట శ్రీను వైట్ల, శ్రీకాంత్, వేణు దోనేపూడి

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు





ప్రమాదానికి గురైన కారు - క్షతగాత్రులు

- ముగ్గురికి గాయాలు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో ఆదివారం కారు అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. తమిళనాడుకు చెందిన భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఆదివారం ఉదయం తిరుమల నుంచి తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 15వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడివైపు నున్న క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ మహిళ గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో తిరుపతికి రుయా ఆస్పత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 80,741 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

మందలించాడని..

- కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేసిన విద్యార్థి
- పోలీసుల అదుపులో బాలుడు.. కేసు నమోదు

తిరుచానూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోజనం చేస్తున్న సమయంలో మందలించారని.. తన ప్రవర్తన తీరుపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని ఆగ్రహించిన విద్యార్థి.. క్షణికావేశంతో కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం అడుసుపల్లికి చెందిన వెంకటరమణ తిరుపతిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఆయన తిరుచానూరులోని బ్రాంచిలో ఉన్నారు. పీలేరుకు చెందిన ఇంటర్ విద్యార్థి.. దసరా సెలవులకు వెళ్లి ఆదివారం రాత్రి క్యాంపస్‌కు వచ్చాడు. రాగానే కళాశాలలో పనిచేసే ఉద్యోగి వెంకటరమణ ఫీజు అడగారు. సమాధానం లేకపోవడంతో అక్కడ కూర్చోబెట్టారు. అదే సమయంలో అతడి తల్లిదండ్రులకు ఫోను చేయగా వారి నుంచి సమాధానం లేదు. అంతకు ముందే ఆ విద్యార్థిపైన కళాశాలలోని వారు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు తీవ్రస్థాయిలో అతడిని మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆ విద్యార్థి.. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆదివారం రాత్రి కళాశాలకు రావడం.. ఫీజు విషయమై ప్రశ్నించారు. అప్పటికే తనపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని, తాను భోజనం చేసే సమయంలో అందరి ముందు అసభ్యంగా మాట్లాడారని ఉద్యోగి రమణపై కోపం పెంచుకున్న విద్యార్థి.. బ్యాగులోని కత్తి తీసి దాడి చేశాడు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తిరుచానూరు పోలీసులకు అప్పగించి, గాయపడిన వెంకటరమణను రుయాకు తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షణికావేశంలో తాను దాడికి పాల్పడినట్లు విద్యార్థి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



గాయపడిన వెంకటరమణ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రకాశంకాలనీలో కార్డెన్ సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకొన్న బైక్‌లు

కోట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ ప్రకాశంకాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆదేశాల మేరకు కోట, వాకాడు, చిట్టమూరు ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, చిన్నబలరామయ్యతో పాటు ఏఏఎస్‌ఐ శోభారాణి ప్రకాశం కాలనీలో తనిఖీలు చేపట్టారు. సరైన రికార్డులు లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

సచివాలయ ఇంజనీరు అసిస్టెంట్‌పై దాడి దారుణం

వెంకటగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిపేట సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిపై 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్ దాడికి పాల్పడటం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, అరవ మంజుల ఖండించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి విధినిర్వహణలో తప్పుచేసి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి అతనిపై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలే తప్ప దాడులకు దిగడం సరికాదన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన కౌన్సిలర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే పాశిం



వాకాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలం మొలగనూరు గ్రామంలోని ముత్యాలమ్మను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, జనార్దనరెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుతకు పట్టని
పుస్తక కేంద్రాలు

- అభివృద్ధికి నోచని గ్రంథాలయాలు
- శిథిల భవనాల్లో పుస్తక పఠనం
- సెస్సు బకాయిలు రూ.40.06కోట్లు
- నత్తనడకన కొత్త భవన నిర్మాణం
- పాలకమండలి లేక కదలిక శూన్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. వేలాది పుస్తకాలతో అన్ని వయసుల వారికి సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించే నిలయాలు. అటువంటి గ్రంథాలయాలు జిల్లాలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో కూర్చోవాలంటే పాఠకులు భయపడుతున్నారు. కొత్త భవనం పూర్తికాక, ఉన్నదేమో శిథిలమై, నూతనత్వానికి నిధుల్లేక జిల్లా గ్రంథాలయ సంస్థ భారంగా రోజులు ఈడుస్తోంది.

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన గ్రంథాలయంతో పాటు జిల్లాలో 61 శాఖలున్నాయి. వీటిలో నెల్లూరు రేబాల వారి వీధిలోని ప్రధాన గ్రంథాలయ, గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం సుమారు వందేళ్ల కిందటిది. ఆ భవంతి శిథిలమై పైకప్పు కూలేందుకు సిద్ధంగా ఉంది. పెచ్చులూడిపడి పాఠకులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి 2019లో అప్పటి, ప్రస్తుత మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ రూ.3కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికా రంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొత్త భవనం పునాదులకే పరిమితమైంది. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఆందోళనలతో ఆ తర్వాత రూ.కోటి చెల్లించారు. దీంతో భవన నిర్మాణం మొదటి అంతస్తు వరకు జరిగి ఆగిపోయింది. ప్రధానమైన ఈ గ్రంథాలయానికి అన్ని వయసుల వారు వస్తుం టారు. ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 50మందికిపైగా చదువుకుంటూ ఉంటారు. అయితే శిథిల భవనం వల్ల వారు ఏకాగ్రతతో చదువుకోలేని పరిస్థితి నెల కొంది. ఇదికాక జిల్లాలోని కొన్ని శాఖా గ్రంథాలయాల భవనాలు కూడా దెబ్బతిన్నాయి. వాటికీ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

పాలక మండలిని పట్టించుకోరే?

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్ తప్ప కమిటీని నియమించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు పాలకమండలి నియామకంపై దృష్టిపెట్ట లేదు. ఈ పరిణామం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. జిల్లాలోని గ్రంథాలయాలకు 2020 - 2021 సంవత్సరంలో కంప్యూటర్లు కొనుగోలు చేశారు. కానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించడంలేదు.


డీఎస్సీ 9888: జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం

ఉమ్మడి జిల్లాలో సెస్సు బకాయిలు ఇలా..

నెల్లూరు నగర పాలక సంస్థ	- రూ.34,27,26,407
కావలి పురపాలక సంస్థ	- రూ.1,19,46,383
గూడూరు పురపాలక సంస్థ	- రూ.87,62,092
ఆత్మకూరు పురపాలక సంస్థ	- రూ.50,27,005
వెంకటగిరి మున్సిపాలిటీ	- రూ.45,86,000
నాయుడుపేట మున్సిపాలిటీ	- రూ.44,96,978
బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ	- రూ.11,12,091
అల్లూరు నగర పంచాయతీ	- రూ.2,43,000
మొత్తం	- రూ.40,05,96,347

వారసత్వ సంపదగా జిల్లా కేంద్ర గ్రంథాలయం

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉండడంతో దానిని వారసత్వ సంపదగా పరిగణించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆయన ఈనెల 10వ తేదీన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. భవన మరమ్మతులకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ కొత్త భవనం పూర్తయ్యాక ప్రస్తుత భవనాన్ని వారసత్వ సంపదగా పురావస్తుశాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాత భవనం మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

పన్నులు చెల్లిస్తేగా..

గ్రంథాలయాలకు ప్రధాన ఆర్థిక వనరు స్థానిక సంస్థలు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఇంటి పన్నుల్లో 2 శాతం గ్రంథాలయ సెస్సుగా వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు జరగకపోవడంతో గ్రంథాల యాల అభివృద్ధికి, సిబ్బంది జీతాలు, పింఛన్ల చెల్లింపునకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. సెస్సు బకాయిలు కోసం గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సమీక్షా సమావేశాల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలని ఆదేశించినా నెల్లూరు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు బేఖాతరు చేస్తూనే ఉన్నాయి. ఆ నిధులు గ్రంథాలయ సంస్థకు ఎప్పుడు చేరుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సూళ్లూరుపేటలో మోటారు సైకిల్ చోరీ
తడలో లభ్యం

సూళ్లూరుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో చోరీకి గురైన మోటారు సైకిల్ తడ మండలంలో లభ్యమైంది. బాధితుడు కథనం మేరకు... పట్టణంలోని పరమేశ్వరినగర్ సమీపంలో శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో ఫాస్ట్‌ఫుడ్ నిర్వహిస్తున్న శ్యామ్ శుక్రవారం రాత్రి తన మోటారు సైకిల్‌ను తన హోటల్ ముందు పెట్టి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి మోటారు సైకిల్ లేదు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ముందున్న సీసీ కెమెరాలో ఫుటేజ్‌లను పరిశీలించగా ఇద్దరు యువకులు వచ్చి మోటారు సైకిల్‌ను తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం సాయంత్రం చోరీకి గురైన మోటారు సైకిల్ తడ మండలం కొండూరు వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. బాధితుడు అక్కడకెళ్లి మోటారు సైకిల్ తెచ్చుకొన్నాడు. ఇటీవలలో పట్టణంలో ఇళ్లు, షాపుల ముందు పెట్టిన మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ఆటో
ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చంద్రబాబ కాలనీ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం పూడికుప్పం ప్రాంతానికి చెందిన మల్లికమ్మ, ధర్మన్ మోటారు సైకిల్‌పై నెల్లూరుకు వెళ్తుండగా నాయుడుపేట సమీపంలోకి రాగానే ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లికమ్మ, ధర్మన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.



వర్షపునీటిలో దొడ్డవారిమిట్ట కాలనీ - టెంకాయతోపు గ్రామంలోని వీధిలో నిల్వ చేరిన నీళ్లు

జలదిగ్బంధంలో గ్రామాలు
చెరువులను తలపిస్తున్న వీధులు

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు నెలబల్లి పంచాయతీ పరిధిలోని టెంకాయతోపు, దొడ్డవారిమిట్ట గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. టెంకాయతోపు గ్రామంలోని వీధుల నిండా వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దొడ్లవారిమిట్ట కాలనీలోని ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరడంతో రెండు గ్రామాలు ఎక్కడో దీవుల్లో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. టెంకాయతోపు గ్రామంలో ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షపు నీరు బయటకు పోవడానికి గతంలో జాతీయ రహదారి పక్కనే డ్రైనేజి కాలువ ఉండేది. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులతో ఆ కాలువ పూడిపోయి కనుమరుగైంది. దీంతో ఎక్కడికక్కడ నీరు బయటకుపోయే దార్లు మూసుకుపోయాయి. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టాలంటే మురుగుతో కూడిన వర్షపునీటిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో నడిస్తే కాళ్లు పాచిపట్టి పుండ్లు అయిపోతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణం మొదలైన నాటి నుంచి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధుల్లో నుంచి వర్షపునీళ్లు బయటకుపోయేలా చర్యలు తీసుకోవాలని టెంకాయతోపు, దొడ్లవారిమిట్ట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే విజయశ్రీ పర్యటన

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం పెళ్లకూరు మండలంలో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. చెంబేడు, చెన్నప్ప నాయుడుపేట, శిరసనంబేడు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయ నున్నట్లు ఆయన వివరించారు.

మట్టలమ్మ గ్రామోత్సవం



కోట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో ఆదివారం మట్టలమ్మ గ్రామోత్సవం జరిగింది. ఉత్తమనెల్లూరుతో పాటు ఇలకూరుపాడు, తాటిగుంట చెరువు గ్రామాల్లో మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగించారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టంగుటూరి ప్రకాశంపంతులు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో 130మందికి వైద్య పరీక్షలు చేసి 80 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ట్రస్టు సీఈవో సీతారామ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏవో కృష్ణ, డాక్టర్ లహరి, అరవింద్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కోడిగుడ్లు పంపిణీ

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, మురళీ సింగ్, జగదీష్, సురేష్, సాయికిరణ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కత్తితో దాడి: ఒకరికి గాయాలు

కోట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కోట మండలం ఉత్తమనెల్లూరు మట్టాలమ్మ పొంగళ్లల్లో ఆదివారం రాత్రి హేమంత్ అనే యువకుడు ప్రసాద్ అనే వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఉత్తమనెల్లూరులో మట్టాలమ్మ గ్రామోత్సవం జరిగింది. గ్రామంలోని రెండు వర్గాలు అమ్మవారికి పొంగళ్లు పెడుతుండగా హేమంత్ మేకపోతును నరికే కత్తిని ప్రసాద్‌పై విసిరాడు. కత్తి ప్రసాద్ వీపుకి తగిలి తీవ్రంగా గాయ పడ్డాడు. అతనిని కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు

పెళ్లకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గణపతిపూజ, కలశ పూజ, హోమాలు నిర్వహించారు. మాజీ సర్పంచు అరుణమ్మ రూ.60వేల విలువ కలిగిన వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అన్నదానం

గూడూరు అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీలోని నారాయణమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున నారాయణమ్మ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆ తరువాత వచ్చే ఆదివారం ఆలయంలో అన్నదానం చేయడం ఆనవాయితీ.

రేపు మెగా జాబ్‌మేళా

సూళ్లూరుపేట/తడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ నెల 22న మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నాయి. శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని దాదాపు 50 పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

నేడు ఓజిలిలో పల్లెపండుగ

ఓజిలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయ కుమార్ నాయుడు తెలిపారు. మండలంలోని పున్నేపల్లి, నెమళ్ళపూడి, కరబల్లవోలు పంచాయతీల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమం 444కి చేరింది. ఆదివారం గాండ్లవీధికి చెందిన కర్లపూడి సాత్విక్ దత్త(7) మృతి చెందాడు. బాలుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేశారు. బాలుడి కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు పంపారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరామ్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

పెళ్లకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్లవారిమిట్ట గిరిజనకాలనీలో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. రూ.8 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఉపాధి సిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన

చిట్టమూరు, అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోగిలి పంచాయతీలోని మద్దిలేటమ్మ కండ్రిగ, సోమసముద్రం, పేరింట్రాలమిట్ట, గొల్లపాళెం, రాఘవేంద్రపురం గ్రామాల్లో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, రషీద్ బాషా, పోలయ్య, మాజీ ఎంపీటీసీ ముజిమీర్ పాల్గొన్నారు.

కటాలమ్మకు పూజలు

గూడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల కటాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.